ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 3 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 78 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు


### అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు



పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది.

**టెహ్రాన్,సెప్టెంబర్2 (సింగిడి):**

2




2

## ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

**కంపెనీ పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో**

# వెయ్యి రోజులు.. ఎవరి లెక్కెంత?

వెయ్యి రోజులు పూర్తయ్యాయి.. అధికార కాంగ్రెస్ తన పాలనను ఘనంగా చెప్పుకుంటోంది.. బీఆర్ఎస్ మాత్రం వైఫల్యాల పేరుతో కౌంటర్ ప్రచారానికి దిగుతోంది. రైతులు, సంక్షేమం, ఉద్యోగాలు, పెట్టుబడులు, మౌలిక వసతులపై ఎవరి వాదన వారిదే. అయితే.. కాంగ్రెస్ వెయ్యి రోజులతో పాటు.. బీఆర్ఎస్ రెండో టర్మ్‌లోని తొలి వెయ్యి రోజుల పనితీరును కూడా పరిగణనలోకి తీసుకుంటేనే పూర్తి చిత్రం కనిపిస్తుంది.

**హైదరాబాద్ బ్యూరో - సింగిడి:**

**కౌంటర్‌గా బీఆర్ఎస్ వైఫల్యాల చార్జ్‌షీట్**

**రెండో టర్మ్‌లో బీఆర్ఎస్ అభివృద్ధి లెక్కలేంటన్న ప్రశ్నలు**

**ప్రచారంతో ప్రజలకు దక్కిందెంత?**

## 1000 రోజుల పాలనపై కాంగ్రెస్ భారీ ప్రచారం

**బీఆర్ఎస్ లెక్క ఇదీ..**

రెండో టర్మ్‌లో రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులు, హైదరాబాద్ మౌలిక వసతులపై బీఆర్ఎస్ ప్రధానంగా దృష్టి పెట్టింది. 2019లో కాళేశ్వరం ప్రారంభమైంది. సాగు విస్తీర్ణం 2014లో 1.31 కోట్ల ఎకరాల నుంచి 2023 నాటికి 2.20 కోట్ల ఎకరాలకు పెరిగినట్లు ఆర్థిక సర్వే గణాంకాలు చెబుతున్నాయి.

**కాంగ్రెస్ ఖాతాలో..**

కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని చెబుతోంది. TG-iPASS ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు కూడా ప్రభుత్వం వెల్లడిస్తోంది.



**ఎవరి పనితీరు ఎంత?**

ఒక ప్రభుత్వం సాగునీరు, రైతు పథకాలు, IT, నగర మౌలిక వసతులను ముందుకు పెడితే.. మరో ప్రభుత్వం రుణమాఫీ, ఉద్యోగాలు, పెట్టుబడులు, సంక్షేమాన్ని ప్రస్తావిస్తోంది. అయితే.. కేటాయించిన నిధులు, పూర్తయిన ప్రాజెక్టులు, అందిన ప్రయోజనాలు, మిగిలిన హామీలు.. వీటన్నింటినీ కలిపి చూస్తేనే రెండు పాలనల మధ్య తేడా స్పష్టమవుతుంది.

**ప్రజలకు ఒరిగిందేంటి..**

పార్టీలు మాత్రం తమ విజయాలను చెప్పుకుంటూ.. ప్రత్యర్థి వైఫల్యాలను ఎత్తిచూపుతూ రాజకీయ ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. కానీ.. సామాన్యుడికి కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు.. ఉద్యోగం, రైతుకు భరోసా, సంక్షేమం, మెరుగైన మౌలిక వసతులు. ఎవరు ఎక్కువగా చెప్పారన్నది కాదు.. ఎవరి హయాంలో ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందన్నదే అసలు కొలమానం.



## రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా

### పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు

**నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ సంగతి చూడండి**

**ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో కొండా సురేఖ భేటీ**

**మీడియా ముందు సంచలన వ్యాఖ్యలు**

2

నాపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌పై సురేఖ డైరెక్ట అటాక చేశారు. ఢిల్లీలో హైకమాండ్‌ను కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సీఎం అని తనే చెప్పుకుంటున్నాడు. అది ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇతర శాఖ మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సీఎంపై మంత్రులు, నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనని రాజీనామా చేయమని, మరొకటిగాని నాకు ఎవరు చెప్పలేదు. హైకమాండ్‌కు రాతపూర్వకంగా అన్ని వివరాలు తెలియజేశానని తెలిపారు

**హైదరాబాద్,సెప్టెంబర్2 (సింగిడి)**

## తెలంగాణ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

### కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 (సింగిడి): తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు.

2

## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

**కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ వినతి**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 (సింగిడి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను



2

**కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు**

**నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు**

**కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**హైదరాబాద్,సెప్టెంబర్ 2 (సింగిడి)**



2

## తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు

**కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌పై బీజేపీ ఫైర్..!**

**సెప్టెంబర్ 17ను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతాం**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ 3 పార్టీలు కలిసి హైదరాబాద్, తెలంగాణ అస్తిత్వాన్ని, నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. **హైదరాబాద్,సెప్టెంబర్ 2 (సింగిడి)**

# భగ్గుమన్న గులాబీ బలగం

### అక్కడ రేవంత్ ఇక్కడ రాజ్ ఠాకూర్.... పేదల బతుకులు కూల్చుతున్నరు

**మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిండ్రు**

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజం**

**కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్**

**గోదావరిఖని,సెప్టెంబరు02(సింగిడి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రామగుండంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి నిరసన సమరభేరి మోగించారు. రామగుండం కౌన్సిల్ కో–ఆర్డినేటర్ మేకల సమ్మయ్య యాదవ్ అధ్యక్షతన, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ...మిగతా 2లో





## రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

**5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం**

**హైదరాబాద్,సెప్టెంబర్ 2 (సింగిడి):**

తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది.

2

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

### ఎటు చూసినా విధ్వంసం, వికృతం.. జలద్రోహం చేస్తున్న జలగల పాలన



**అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో**

**భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు**

**వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు**

**కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ ఛార్జ్‌షీట్**

**సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్**

2

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జిషీట్ విడుదల చేశారు.

**హైదరాబాద్,సెప్టెంబర్2 (సింగిడి)**

# నదుల అనుసంధానమే అంతిమ లక్ష్యం

**ప్రతి ఎకరాకు నీళ్ళిచ్చి తెలుగుతల్లి రుణం తీర్చుకుంటా**

**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

2



**అనకాపల్లి,సెప్టెంబర్ 2 (సింగిడి):**

ఏపీలో అన్ని నదులను అనుసంధానం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి తెలుగుతల్లి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. బుధవారం ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసి సీఎం జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఉత్తరాంధ్రకు గోదారమ్మను తీసుకువచ్చామని తెలిపారు. నదులు, వాగులు, వంకలు దాటుకుని గోదారమ్మ వచ్చిందని ప్రస్తావించారు. వెలిగొండ ప్రాజెక్ట ద్వారా కృష్ణమ్మను తరలించి.. కరువు పీడిత మార్కాపురానికి నీళ్లిచ్చామని ఉద్ఘాటించారు.



## అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా జితేంద్ర మిశ్రా

2

**ఎయిర్ మార్షల్‌గా విశేష సేవలు అందించిన అనుభవం**

**అయోధ్య,సెప్టెంబర్ 2 (సింగిడి):**

అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. ఈ మేరకు జన్మభూమి ట్రస్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ.. 39 ఏళ్లపాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించిన జితేంద్ర మిశ్రాను ఆలయ ట్రస్ట్ సీఈఓగా నియమిస్తున్నట్టు ప్రకటించింది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఒక పెట్రోల్ విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఏఈకు తీవ్ర హెచ్చరిక కూడా జారీ చేశారు. యూఏఈకు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబీ పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిస్సైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిస్సైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్లు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్లు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు చేయలేదని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు

**హైదరాబాద్,సెప్టెంబర్ 2 (సింగిడి):**
కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ 3 పార్టీలు కలిసి హైదరాబాద్, తెలంగాణ అస్తిత్వాన్ని, నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఉన్నంతకాలం తెలంగాణ ప్రజలకు పోరాట చరిత్రను వివరిస్తూనే ఉంటామని.. తాము అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 గొప్పతనాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని ప్రకటించారు. హనుమకొండ జిల్లా పరకాలలో తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరకాలలోని అమరధామం వద్ద రామచందర్ రావు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ప్రారంభంలో పరకాల అమరధామం వద్ద నివాళులర్పించే అవకాశం రావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. 1947లో ఇదే రోజున ఇదే ప్రాంతంలో దక్షిణాది జలియన్ వాలా బాగ్ గా చెప్పుకునే ఘటన చోటుచేసుకుందని రామచందర్ రావు పేర్కొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు గ్రామస్తులు సమావేశమైన సమయంలో రజాకారులు, నిజాం పోలీసులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని.. ఈ ఘటనలో 22 మంది మరణించగా, పలువురు గాయపడ్డారని తెలిపారు. తెలంగాణ పోరాట చరిత్రలో కీలకమైన ఈ ఘటనను కొన్ని రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా విస్మరించాయని ఆయన ఆరోపించారు. అమరవీరుల త్యాగాలను చరిత్ర నుంచి ఎవరూ చెరిపివేయలేరని రామచందర్ రావు అన్నారు. త్రివర్ణ పతాకం కోసం వారు ప్రదర్శించిన ధైర్యం, చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నిజాం వ్యతిరేక పోరాటానికి ప్రేరణ ఇచ్చిన వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానపరుస్తోందని విమర్శించారు. సెప్టెంబర్ 17న తెలంగాణలోని ప్రతి గ్రామంలో విద్యార్థులు, యువత, ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించాలని పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదని రామచందర్ రావు ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీకి భయపడే కారణంగానే ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇది కేవలం ఒక రాజకీయ అంశం కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు, తెలంగాణ పోరాట చరిత్రకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని స్పష్టం చేశారు.

# రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను ద ష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా వ¶డు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత బియ్యం పంపిణీపై మరింత అవకాశం ఉండకపోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఇంకా కోటా తీసుకోని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. 3 నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడం వల్ల ఏర్పడిన రద్దీ, పండుగ కారణంగా లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువు పొడిగించడం రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా మారింది. దీంతో రేషన్ బియ్యం తీసుకోలేని వారికి మరో అవకాశం లభించింది.

# భగ్గుమన్న గులాబీ బలగం

మొదటి పేజీ తరువాయి

కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు 420 హామీలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందల రోజులు గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో 'అభయహస్తం' పేరిట మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పింఛన్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, దళితులకు అంబేడ్కర్ అభయహస్తం వంటి హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని చందర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన రైతుబంధు, కళ్యాణలక్ష్మి , కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ



పథకాలను సైతం నిలిపివేశారని విమర్శించారు.

**రామగుండంలో అభివృద్ధి శూన్యం ....**

రామగుండం నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని చందర్ ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి



మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నికల హామీలే ప్రధాన కారణమని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆరోపించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక భరోసా, ఉద్యోగాల భర్తీ వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు న్యాయం చేయలేకపోయిందని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమలును పక్కన పెట్టి మాజీ సీఎం కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజా



సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని హరీష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మిరియాల రాజిరెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, మూల విజయారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాముల నారాయణ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మీ మహేందర్‌రెడ్డి, ధర్మాజీ కృష్ణ, సతీష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కోల సంతోష్, మహేష్, కర్క పద్మజ, రమేష్, కిషన్‌రెడ్డి, నటుపల్లి శ్రీనివాస్, ఈదునూరి శ్రీకాంత్, మచ్చ వేణు, జక్కుల తిరుపతి, నూతి తిరుపతి, మెతుకు దేవరాజ్, బొడ్డు రవీందర్, సాయి కుమార్ (చింటు) తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా

నా బిడ్డ మాట్లాడితే నాకెందుకు శిక్ష వేస్తారు. రెడ్లలో ఎంతో మంది అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. బీసీకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. అంతా సద్దుమణిగింది అనుకునే తరుణంలో సురేఖ వ్యాఖ్యల అంతరార్థం ఏటంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. ఢిల్లీలో రాజీ మంత్రం బెడిసికొట్టడం వల్లే ఆమె ఇలా మాట్లాడుతుందే మోనని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. మరోవైపు సురేఖపై అధిష్ఠానానికి సీఎం నివేదికను అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఆమె చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈరోజే కొండా సరేఖపై హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ



పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# తెలంగాణ విమానాశ్రాయాలను త్వరగా పూర్తి చేయండి

ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.ఆదిలాబాద్‌లో రన్ వే ఫైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజరు జాజు, సీఎం సెక్రటరీ మాణిక రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రో మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ఢిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్‌ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు.



# ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ్రÖశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు




# ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 (సింగిడి):**
ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక ఇచ్చింది. సంస్థ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ–మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోటాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

# అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా జితేంద్ర మిశ్రా

భారత వైమానిక దళానికి సంబంధించిన ఎన్నో ఆపరేషన్లలో కీలకంగా పని చేసిన మిశ్రా.. గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ కమాండర్‌గా సేవలందించారు. 2026 ఏప్రిల్లో ఆయన ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా రిటైరైయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో తన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్వోత్తమ యుద్ధ సేవ మెడల్‌ను కూడా అందుకున్నారు. రామాలయ ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులను కూడా కమిటీ నియమించింది. మదన్ మోహన్ పాండే, మహేశ్ భగచంద్కా, నిర్మలా యాదవ్‌లను సభ్యులుగా ఎంపిక చేసింది. కొన్ని నెలల క్రితం అయోధ్య రామాలయ విరాళాల్లో దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిందే. అందుకే ట్రస్ట్ ప్రక్షాళన దిశగా ఈ మేరకు మార్పులు అనివార్యమయ్యాయి. రాములోరి నిధులు కాజేసిన కేసులో ఎనిమిది మంది ఇప్పటికే అరెస్టయ్యారు. దీంతో అప్పటి జనరల్ సెక్రటరీ చంపత్ రారు తన పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా దేశంలో దుమారం రేగిన సంగతి తెలిసిందే.

# నదుల అనుసంధానమే అంతిమ లక్ష్యం

నల్లమల కొండలను చీల్చుకుని కృష్ణమ్మ వచ్చిందని అన్నారు. ఎన్నో సమస్యలను అధిగమించి గోదావరి జలాలు తీసుకువచ్చామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం రూ.4 వేల కోట్ల ఖర్చు చేశామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం సుభిక్షంగా మారేలా చేస్తామని తెలిపారు. ఈ జల విజయం.. ప్రజల విజయమని చెప్పుకొచ్చారు. ఆధునిక దేవాలయాలు.. సాగునీటి ప్రాజెక్టులు అని అభివర్ణించారు. నీరు ఉంటేనే భద్రత, భవిష్యత్తుపై ఓ భరోసా కల్పిస్తుందని తెలిపారు. నీరు ఉంటేనే పరిశ్రమలు.. తద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. 2014లో తాము అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టిపెట్టామని అన్నారు. 2019 నాటికి 72 శాతం పోలవరం పనులు పూర్తిచేశామని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం.. పోలవరాన్ని పర్యవేక్షించేలా మార్చామని వెల్లడించారు. 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిందని.. పోలవరానికి శాపమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ధ్వజమెత్తారు. పోలవరం నిర్వాసితులకు గొడ్డలి పార్టీ పైసా కూడా ఇవ్వలేదని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పోలవరానికి శాపవిముక్త కలిగిందని వ్యాఖ్యానించారు. 2028 నాటికి మొత్తం 12 ప్రాజెక్టులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయని ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు తీసుకువస్తున్నామని వివరించారు. ఉత్తరాంధ్రకు కంపెనీలు వస్తుంటే.. గొడ్డలి పార్టీకి అసూయగా ఉందని దుయ్యబట్టారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్రకే వలసలు వస్తారని అన్నారు. ఇకపై ఉత్తరాంధ్ర.. ఉత్తమ ఆంధ్రగా మారుతుందని నొక్కి చెప్పారు.

సింగిడి
Singidi
గురువారం
03-9-2026



# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

- 22ఏ భూముల సమస్యపై అసెంబ్లీని కదిలిస్తాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, సెప్టెంబర్ 2 (సింగిడి):** 420 హామీల పేరుతో అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్న.. హామీల అమలులో ఘోరంగా విఫలం కావడంతోపాటు.. విధ్వంస పాలన కొనసాగిస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలన నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పటాన్చెరు పట్టణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎంజీ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ప్రదర్శన, నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. తొంభైవ దశకం నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఇంత దారుణమైన, దరిద్రమైన పరిపాలనను తాను చూడలేదని విమర్శించారు.

**ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను ప్రజలకు ఇచ్చిన మాటగా భావించి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పటాన్చెరు నియోజకవర్గంలో కూడా ప్రతి ప్రజా సమస్యపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**22ఏ భూములపై పోరాటం ఉధృతం**

22ఏ నిషేధిత జాబితాలో ఇలాంటి వివాదాలు లేని భూములను చేర్చడం ద్వారా ప్రజల ఆస్తులను అమ్ముకోలేని, కొనలేని పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే అన్నారు. 22ఏ పేరుతో ప్రజల ఆస్తులపై విధిస్తున్న ఆంక్షలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. 22ఏ భూముల సమస్యను అసెంబ్లీలో ప్రధాన అంశంగా లేవనెత్తి, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు గతంలో అందిన సంక్షేమ పథకాలు ఇప్పుడు సక్రమంగా అందడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

**ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోరాటం**

పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో బీఆర్ఎస్ పోరు బాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని సూచించారు. పార్టీ తరపున పెద్ద సంఖ్యలో బకాయి హామీల కార్డులను సిద్ధం చేశామని, వాటిని నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, వార్డులు, గ్రామాలకు తీసుకెళ్లి ప్రజలకు పంపిణీ చేయాలని నాయకులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చేవరకు విడిచిపెట్టే ప్రసక్తే లేదు

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై రణరంగంగా మారిన కుత్బుల్లాపూర్ చౌరస్తా**





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (సింగిడి):** కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసనలో భాగంగా కుత్బుల్లాపూర్ లో మొదటి రోజు నిర్వహించిన ధర్నా కార్యక్రమం ప్రజల నిరసన ప్రభుత్వంపై ప్రచ్ఛన్న యుద్ధంగా ఏర్పడింది. అందులో భాగంగా కుత్బుల్లాపూర్ చౌరస్తా లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మీడియా ముఖంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి తమ నిరసనను తెలియజేసి ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఏ విధంగా పాల్గొన్నారో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగాపాలనపై మరో మారు కదం తొక్కిన గులాబీ దండును చూస్తుంటే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే రేవంత్ సర్కార్ కెసిఆర్ పై వ్యక్తిగత దూషణలకు దిగుతూ ప్రజలను దారిమల్లిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై, ప్రజలకు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ పార్టీ సమర శంఖం పూరించిందన్నారు. అబద్దాల పునాదులపై ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో ఇస్తానన్న హామీలు 1000 రోజులైనా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రేవంత్ సర్కార్ ని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామన్న స్కూటీలు ఎక్కడా అని నిలదీశారు. విద్యాభరోసా కార్డు అన్నడు, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తాం, జాబ్ క్యాలెండర్ అన్నాడు వాటి అమలు మాత్రం ఆమడ దూరంలో వున్నదని ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తా అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు నీ ముఖం ఎక్కడ పెట్టుకుంటవ్ నిలదీశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నడు నమ్మలేదు, అందుకే ఢిల్లీ నుంచి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పిలిపించుకొని దొంగ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తన అనుయాయులతో స్క్వేర్ ఫీట్ కు వంద రూపాయలను వసూలు చేసే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేసీఆర్ ను రాజీనామా చేసేలా ప్రజలను కోరాలని కాంగ్రెస్ నాయకులను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయమంటున్నవ్ కదా! మీ కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లితే బట్టలిప్పి కొట్టడం ఖాయమని హెచ్చరించారు. మీరు 1000 రోజుల్లో ప్రజలకు ఏమి చేశారో చెప్పండి, మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు క్షమించరు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే వివరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ రెవెన్యూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 2 (సింగిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ చంద్రా రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పెండింగ్ రెవెన్యూ అంశాలు, భూ సర్వే సంబంధిత పనుల పురోగతిపై ఆయన అధికారులతో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు సత్వరంగా అందేలా అధికారులు అందరూ సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ



సమావేశంలో షాద్‌నగర్ ఆర్డీఓతో పాటు సంబంధిత డివిజనల్ తహసీల్దార్లు, ఏడీఎస్ఎల్ఆర్, డీసీఎస్‌వో, డీఎంసీఎస్, మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.


## ఫతేనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ఎంపీ ఈటెల రాజేందర్**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 2 (సింగిడి):** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. వివిధ కార్యక్రమాలలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి ఫతేనగర్ ఎం.ఎం.టి.ఎస్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. గతంలో కూలిపోయిన రైల్వే బ్రిడ్జ్ స్టెయిర్‌కేస్ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎం.ఎస్. స్టెయిర్‌కేస్‌ను పరిశీలించి, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఫతేనగర్ ప్రధాన రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్డు దాటేందుకు వృద్ధులు, మహిళలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని వివరించారు. ప్రజల సౌకర్యార్థం అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటెల రాజేందర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫతేనగర్ స్మశాన వాటికలో సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందిని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీ ఆ సమస్యను కూడా అధికారుల ద్వారా త్వరలోనే పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు నిరంతరం అందుబాటులో ఉంటారని వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ బీజేపీ నాయకులు కంచి మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, సతీష్ గౌడ్, నజీర్, ఉదయ్, హరిప్రసాద్‌తో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గ్, చించోడు పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 2 (సింగిడి):** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ స్వర్ణ కుమారి బుధవారం కొందుర్గ్, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. అదేవిధంగా మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, ప్రసవ సేవలతో పాటు రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

# వెయ్యి రోజుల్లోనూ నెరవేరని హామీలు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (సింగిడి):** వంద రోజుల్లో అమలు చేస్తామంటూ 420 బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు దాటినా ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా వంచించిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎవరు అభివృద్ధి చేశారో, ఎవరు చేయలేదో ప్రజల సమక్షంలోనే తేల్చుకుందామని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు తిప్పలు తప్పడం లేదని ఆరోపించారు. రూ. 4 వేల పింఛను, ఒంటరి మహిళలకు నెలకు రూ. 2,500, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. గతంలో కేసీఆర్ పాలనలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రూ. 5 భోజనం, ఆడబిడ్డలకు గౌరవంగా బతుకమ్మ చీరలు అందించామని, నేడు ఆ సంక్షేమాన్ని కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ ప్రచారం చేసుకుంటూ, మరోవైపు వారి కుటుంబాలపై భారాలు మోపుతున్నారని దుయ్యబట్టారు. గడిచిన మూడేళ్లలో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ. 72 వేల వరకు బాకీ పడిందని, ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 5 లక్షలు బాకీ ఉందని పేర్కొంటూ, ఈ వివరాలతో కూడిన 'బాకీ కార్డు'ను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని స్పష్టం చేశారు. తమ హయాంలో బోయిన్‌పల్లి అభివృద్ధికి రూ. 150 కోట్లు ఖర్చు చేశామని, రూ. 100 కోట్లతో తాగునీటి వ్యవస్థను పటిష్టం చేసి 20 వేల లీటర్ల ఉచిత నీరు అందించామని తెలిపారు. నేడు ప్రజలకు నీటి బిల్లులు పంపుతూ ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రూ. 44 లక్షలతో సమకూర్చిన అంబులెన్సుల నుంచి తన ఫోటోలను తొలగించడం కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. బోయిన్‌పల్లిలో మెజారిటీ స్థలాలను 22ఏ పరిధిలోకి తెచ్చి స్థానిక ప్రజలను, పేదలను కబ్జాదారులుగా చిత్రీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మోసాలను ఆధారాలతో సహా బయటపెడతామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, హరినాథ్, ఇర్ఫాన్, మక్కాల నర్సింగ్ రావు, నరేందర్ గౌడ్, ఎజాస్ పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో రేవంత్‌ను తరిమికొట్టుడు ఖాయం

- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే
- మాజీ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి ఘాటు విమర్శలు



**కొడంగల్, సెప్టెంబర్02(సింగిడి):** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొడంగల్ ప్రజలు తరిమి కొట్టుడు ఖాయమని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ లలో ఏఒక్కటి పూర్తిగా అమలు చేయలేదనీ ఆరోపించారు. బిఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు కొడంగల్ లోని మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ గా వెళ్ళి, అంబేద్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొడంగల్ అభివృద్ధి లో జరుగుతున్న అవినీతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరికట్టడం లేదని, వెంటనే విజిలెన్స్ అధికారుల ద్వారా ఎంక్వైరీ చేయించాలని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిగ్గు శరం ఉంటే ఆరు గ్యారంటీ లను రాష్ట్రమంతటా కాకపోయినా, కనీసం కొడంగల్ నియోజకవర్గం లోనైన అమలు చేయాలని ఘాటుగా విమర్శించారు. కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, రైతు భీమా, రైతుబంధు, వరిపంట కు బోనస్ ఎందుకు ఆపారనీ, నిలదీశారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చి కెసిఆర్ ఇచ్చిన నోటిఫికేషన్ లను భర్తీచేశారే కానీ, ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, నిరుద్యోగుల పట్ల ఎందుకింత వివక్ష అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను, అభివృద్ధి ని మరిచిపోయి, అన్నదమ్ములు ఆస్తులు కూడగట్టుకుంటున్నారనీ, ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి అని విమర్శలు గుప్పించారు. కొడంగల్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్య సిబ్బంది ని నియమించలేదనీ, పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని, కొడంగల్ ప్రజలకు ఏం న్యాయం చేశావని ఎద్దేవా చేశారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై ఇసుక మాఫియా కు, అవినీతికి పాల్పడుతున్నారనీ, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని, రెండేళ్ల లో బిఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారం లోకి రాగానే కాంగ్రెస్ నాయకుల భరతం పడతామని, అవినీతిని బయటపెట్టి, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని మండిపడ్డారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను చెరిపివేసి, ప్రజలను ఇబ్బందులు కలిగిస్తున్నారనీ, తనహయాంలో వేసిన రోడ్లను తవ్వి, కమిషన్‌ల కోసం రోడ్డు వెడల్పు లు చేపట్టినారు, నాణ్యత లేకుండా పనులు కొనసాగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఈకార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ, బిఆర్ పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, మధుసూదన్ యాదవ్, కోట్ల యాదగిరి, మహేందర్ రెడ్డి, శేరినారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మైపాల్ రెడ్డి, భీములు, చాంద్ పాషా, ఎర్రన్ పల్లి శ్రీనివాస్, కోట్ల మైపాల్, మడిగె శ్రీనివాస్, లగచర్ల సురేష్, నరేష్ గౌడ్, మహేందర్, అరుణ్ పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు

- వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (సింగిడి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు మహదేవపూర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మన ముందు లేకున్నా అతని పథకాలు ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోయాయని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి తెలిపారు. వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారంలోని ఎస్వీఆర్ ట్రస్ట్ గ్లోబల్ స్కూల్లో చిన్నారులు వైయస్సార్ ప్రవేశపెట్టిన పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ముగ్గురూపకంలో వేసి వైయస్ కలలను గుర్తు చేశారు. స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ వర్ధంతి, జయంతినీ పురస్కరించుకొని ప్రతి ఏటా నేటి యువతకు ఆయన ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి, గోపాల్, మాదాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,



డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలి

**విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం**

**ఎబీవీపీ వినతిపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ**



**పటాన్చెరు, సెప్టెంబర్ 02 (సింగిడి):** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతామని తెలిపారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు అశోక్, మేరాజ్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీకాంత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి అభివృద్ధి పనులపై ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**వికారాబాద్ సెప్టెంబర్ 2(సింగిడి):** హైదరాబాద్‌లోని జిల్లా పరిధిలోని పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్. టి. రామ్మోహన్ రెడ్డి ఇరిగేషన్ శాఖకు చెందిన ఎస్ సీ,డి ఈ ఈ, ఈ ఈ, ఎ ఈ ఈ స్థాయి అధికారులతో ఆయన నివాసంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గంలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, పెండింగ్ పనుల పురోగతి, కొత్త ప్రతిపాదనలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులను వేగవం తంగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

# ఎడిటోరియల్

Editorial

## రైతు ఓటుకు తాళం..
## సింగిల్ విండోలపై రాజకీయ పట్టు!

రైతు రుణం, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లతో ముడిపడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రజల నోట సింగిల్ విండోలుగా పేరుపొందాయి. రైతుల భాగస్వామ్యంతో నడిచే ఈ సంస్థలకు నాయకత్వాన్ని రైతులే ఎన్నుకోవాలా? లేక ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ, పరిపాలనా నియామకాలతో పాలకవర్గాలను ఏర్పాటు చేయాలా? తెలంగాణలో ఇప్పుడు ఇదే అసలు ప్రశ్న. జీవో ఆర్‌టి నంబర్ 597కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకోవడం, గత ఎన్నికైన పాలకవర్గాల కొనసాగింపుపై హైకోర్టు ముందు చోటుచేసుకున్న పరిణామాలు ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నాయి---తాత్కాలిక ఏర్పాట్లు శాశ్వత పరిష్కారం కావు. సహకార రంగానికి దీర్ఘకాలిక మార్గం చట్టబద్ధమైన ఎన్నికలే.

తెలంగాణలో మొత్తం 60,925 సహకార సంఘాలు ఉన్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో రైతులకు ప్రత్యక్ష సంబంధం ఉన్న పీఏసీఎస్‌లు 906. తొమ్మిది జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పరిధిలోని ఈ సంఘాల్లో 906 చైర్మన్ పదవులు, సుమారు పది వేల డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. అంటే గ్రామీణ స్థాయిలో వేలాది నాయకత్వ అవకాశాలు, రైతుల ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడిన కీలక వ్యవస్థ. జీవో 597 చుట్టూ సాగిన పరిణామాలు ఈ పదవుల భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరతీశాయి. రైతు సంస్థల నాయకత్వం ఎన్నికల ద్వారా రావాలా, నియామకాల ద్వారా రావాలా అన్న ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తాత్కాలిక పాలన ప్రజాస్వామ్యానికి శాశ్వత ప్రత్యామ్నాయం కాదు.

సింగిల్ విండోలు సాధారణ ప్రభుత్వ కార్యాలయాలు కావు. సభ్యుల భాగస్వామ్యం, ఆర్థిక కార్యకలాపాలు, రుణాలు, గ్రామీణ వ్యవసాయ అవసరాలతో ముడిపడిన సహకార సంస్థలు. ప్రభుత్వం వాటిని పర్యవేక్షించవచ్చు. అవకతవకలు జరిగితే విచారణ చేయవచ్చు. నిధుల దుర్వినియోగం నిర్ధారణైతే బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు. ఓటర్ల జాబితాల్లో లోపాలుంటే సరిచేయవచ్చు. కానీ కొందరి తప్పుల పేరుతో చట్టబద్ధంగా ఓటు హక్కు ఉన్న రైతు సభ్యుల ఎన్నికల అవకాశాన్ని నిరవధికంగా పక్కనపెట్టడం సరైన పరిష్కారం కాదు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోండి.. కానీ రైతు ఓటుపై తాళం వేయకండి.

జగిత్యాల జిల్లా పోతారం సింగిల్ విండో సొసైటీ రైతుల ఐక్యతతో రెండు కోట్ల రూపాయల ఆదాయాన్ని సొంతంగా సమకూర్చుకుందని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికైన పాలకవర్గం ఉంటే ప్రశ్నించే గొంతుకు అవకాశం ఉంటుంది. నామినేటెడ్ వ్యవస్థలో భిన్నాభిప్రాయాలకు స్థానం తగ్గిపోతుందన్న ఆందోళన ఉంది. సంఘాల ఆర్థిక వనరుల వినియోగంపై పారదర్శకత, సభ్యులకు జవాబుదారీతనం ఉండాలంటే ప్రజాస్వామ్యబద్ధమైన పాలకవర్గాలే బలమైన మార్గం. ఇది ఒక్క పోతారం సమస్య కాదు; రాష్ట్రవ్యాప్తంగా సహకార రంగం భవిష్యత్తుకు సంబంధించిన అంశం. రైతు డబ్బు, రైతు భాగస్వామ్యం ఉన్న చోట రైతు స్వరం కూడా ఉండాలన్నదే సహకార స్ఫూర్తి.

సహకార సంఘం అధ్యక్ష పదవి ఎవరికైనా రాజకీయ బహుమతిగా మారకూడదు. రైతు ప్రయోజనాలకు కట్టుబడి పనిచేసే వ్యక్తి సభ్యుల విశ్వాసాన్ని ఎన్నికల్లో పొందే అవకాశం ఉండాలి. రాజకీయ పార్టీలకు చెందిన రైతులు కూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు; గెలవవచ్చు, ఓడిపోవచ్చు. అదే ప్రజాస్వామ్యం. కానీ ముందుగానే నామినేషన్ల ద్వారా పాలకవర్గాలను ఏర్పాటు చేస్తే ఎంపికకు ప్రమాణం ఏమిటి? రైతు ప్రయోజనమా, రాజకీయ విధేయతా? అన్న సందేహాలు రావడం సహజం. వాటికి తెరపడాలంటే ఎన్నికలే ఉత్తమ మార్గం.

ఇక తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. పదవీకాలం ముగిసిన సంఘాల వివరాలను వెల్లడించాలి. చట్టం, సంఘాల ఉపనియమాల ప్రకారం ఓటు హక్కు ఉన్న సభ్యులతో పారదర్శక ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలి. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి వాటిని పరిష్కరించాలి. అనంతరం దశలవారీగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అవసరమైన చోట మాత్రమే పరిమిత కాలపు చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలి; అవి శాశ్వత నామినేటెడ్ పాలనగా మారకూడదు.

రైతు సంక్షేమం అంటే కేవలం రుణమాఫీ, సబ్సిడీలు, పథకాలే కాదు. రైతుకు తన సంస్థ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడం కూడా సంక్షేమమే. “మా సంఘానికి నాయకుడిని మేమే ఎన్నుకునే రోజు ఎప్పుడు?” అన్న రైతు ప్రశ్న కేవలం పదవుల వివాదం కాదు; సహకార వ్యవస్థ స్వరూపం, రైతు భాగస్వామ్యం, గ్రామీణ ప్రజాస్వామ్యానికి సంబంధించిన పరీక్ష. ఈ ప్రశ్నకు ప్రభుత్వం మాటలతో కాదు---ఎన్నికల నోటిఫికేషన్‌తో సమాధానం చెప్పాలి. నామినేటెడ్ పోస్టులు వద్దు.. సింగిల్ విండోలకు ఎన్నికలు కావాలి! రాజకీయ పట్టు కాదు... రైతు ఓటే గెలవాలి!

**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176.**

## నాడు పంజరంలో పక్షులు...
# నేడు సర్కారుపైనే సవాళ్లా?

స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ఉన్నతమైన లక్షణం. కానీ, అదే స్వేచ్ఛను ఆసరాగా చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలను శాసించాలని చూడటం, ప్రజా తీర్పుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని కోసం గొంతు విప్పితే పీడీ (గ్రాణ) యాక్టులు, తక్షణ సస్పెన్షన్లు, దూర ప్రాంతాలకు కక్షపూరిత బదిలీల ఉక్కుపాదం మోపిన వైనం రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలిసిందే. నాడు అణచివేత, భయం ముందర మోకరిల్లి,



హెచ్చరించడం తీవ్రమైన అహంకార పూరిత వైఖరి అవుతుంది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలు, కొన్ని ఉద్యోగ సంఘాల నేతల నిరసనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వ్యక్తంచేసిన తీవ్ర ఆగ్రహం,ఆక్రోశం --- “నన్ను బెదిరిస్తున్నారా? ఒత్తిళ్లకు భయపడే ప్రసక్తే లేదు” --- ఈ రోజు రాష్ట్రంలోని ప్రాధాన్యతలను, ఉద్యోగుల నైతిక బాధ్యతలను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. ఇది కేవలం ఒక ముఖ్యమంత్రి రాజకీయ ఆవేదన లేదా ఆగ్రహం మాత్రమే కాదు; ప్రజాస్వామ్యంలో ప్రజల పన్నులతో వేతనాలు పొందుతున్న ఒక యంత్రాంగంపై సామాన్య పౌరుడి తరపున పడిన అత్యంత పదునైన ఎడిటోరియల్ నిలదీత.

నిరంకుశత్వం దాటిన చోట బెదిరింపులా?

గత బీఆర్ఎస్ (కేసీఆర్) దశాబ్ద కాలపు పాలనను ఒక్కసారి వెనక్కి తిరిగి స్మరించుకుంటే, ఆనాడు ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉండేదో ఊహించుకోవడానికే ఒళ్లు గగుర్పొడుస్తుంది. నాటి నిరంకుశ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు అందకపోయినా, మెడికల్ బిల్లులు కరిగిపోతున్నా, డీఏ (ణూ) బకాయిలు కొండలా పేరుకుపోయినా ఏ ఉద్యోగ సంఘం నేత కూడా పెదవి విప్పే సాహసం చేయలేదు. ఆనాడు ప్రజాస్వామ్య నిరసనల వేదికైన ‘ధర్నా చౌక్’ను నిర్దాక్షిణ్యంగా ఎత్తివేసి, హక్కుల పంజరంలో పక్షుల్లా మౌనం వహించిన కొందరు ఉద్యోగ నేతలు, నేడు ప్రజాస్వామ్యయుతంగా స్వేచ్ఛను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై “బెదిరింపు ధోరణి” ప్రదర్శించడం వెనుక ఉన్న అసలు రాజకీయం ఏమిటి?

?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత పాలకులు మిగిల్చి వెళ్లిన వేల కోట్ల అప్పుల భారాన్ని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని మోస్తూ కూడా ఉద్యోగుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చింది. దశాబ్ద కాలంగా అస్తవ్యస్తంగా మారిన వేతనాల వ్యవస్థను గాడిలో పెట్టి, ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల అకౌంట్లలో జీతాలు జమ అయ్యేలా చారిత్రాత్మక చర్యలు తీసుకుంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పంచాయతీ సిబ్బందికి సైతం వేతనాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కును గౌరవిస్తూ ప్రభుత్వం స్వేచ్ఛను కల్పిస్తే, దానిని ప్రభుత్వం యొక్క బలహీనతగా భావించి సర్కారునే శాసించాలని చూడటం ఏ రకమైన న్యాయం?

ఆర్థిక వాస్తవాలను విస్మరిస్తే ఎలా?

కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వైఫల్యాలు, అంతరాయం లేని వడ్డీల భారం, ఖజానా ఖాళీ అయిన దుస్థితి నుంచి రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి గట్టెక్కించేందుకు ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. పిఆర్సి (గ్రా=జ), డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి ఉద్యోగుల న్యాయమైన అంశాలను ప్రభుత్వం ఎన్నడూ తోసిపుచ్చలేదు. విడతల వారీగా బకాయిలు చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తూ, కమిటీలు వేసి పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్న సమయంలో... వీధుల్లోకి వచ్చి తీవ్ర ఒత్తిడి తేవడం, రసాభాస సృష్టించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ. ప్రభుత్వ ఉద్యోగులు ఏ ప్రత్యేకాధికార గ్రహం నుంచో ఊడిపడలేదు. వారు రాష్ట్రంలోని సామాన్య ప్రజలు చెల్లించే పరోక్ష, ప్రత్యక్ష పన్నుల ద్వారానే వేతనాలు, సదుపాయాలు పొందుతున్న వ్యవస్థలోని ప్రాథమిక భాగస్వాములు. రాష్ట్రంలో కోట్లాది మంది పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు మరియు నిరుద్యోగుల సంక్షేమం కోసం వెచ్చించాల్సిన ప్రజాధనాన్ని సమతుల్యం చేయాల్సిన గురుతర బాధ్యత పాలకులపై ఉంటుంది. బడ్జెట్ మొత్తాన్ని కేవలం ఉద్యోగుల వేతనాలకే కేటాయించాలనడం ప్రజాస్వామ్య ధర్మానికి విరుద్ధం. ప్రభుత్వంపై రాజకీయ ప్రేరేపిత ఆందోళనలతో దాడి చేస్తే, దాని ప్రభావం నేరుగా సామాన్య పౌరుడిపైనే పడుతుంది.

ఉద్యోగులు ఆత్మపరిశీలన చేసుకోవాలి
ద

రాష్ట్ర అభివృద్ధిలోనూ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ప్రభుత్వ యంత్రాంగానికి ఉద్యోగులే వెన్నుముక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా అంగీకరించారు. అయితే, ఆ వెన్నుముకే విరిగిపోయేలా నిరంతరం ఒత్తిడి తెస్తే మొత్తం పాలనా వ్యవస్థే కుప్పకూలిపోతుంది. నాటి కేసీఆర్ ప్రభుత్వంలో గొంతు నొక్కుకున్న వేళ చూపిన “భయం”, నేటి ప్రజాస్వామ్య స్వేచ్ఛా వాతావరణంలో “బెదిరింపుగా” మారడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ప్రభుత్వం కల్పించిన గౌరవాన్ని, దక్కిన ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ రాజకీయం చేస్తే ప్రజలు ఏనాటికీ క్షమించరు.
?ఉద్యోగ సంఘాల నేతలు వెంటనే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాజకీయ స్వార్థం వేరు, ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన వేరు. బెదిరింపుల సంస్కృతిని పూర్తిగా పక్కనబెట్టి, రాష్ట్ర ఆర్థిక ప్రరిమితులను అర్థం చేసుకుంటూ బాధ్యతాయుతమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం. స్వేచ్ఛను గౌరవించే ప్రభుత్వాన్ని సవాలు చేయడం మానుకోకపోతే, అది కేవలం పాలనా వ్యవస్థకే కాకుండా ఉద్యోగ యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న విశ్వసనీయతకే తీవ్ర విఘాతం కలిగిస్తుంది.

**వెంక గారి భూమయ్య సీనియర్**
జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

# తెలంగాణలో నేత పని వారి సమస్యలు... సహకార సంఘాలు



తెలంగాణ రాష్ట్రంలో జనాభాలో మూడింట రెండు వంతుల మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండగా దీని తర్వాత పెద్ద సెక్టార్ అయిన చేనేత పరిశ్రమ దేశంలో రాష్ట్రంలో ప్రముఖ స్థానం వహిస్తూ ఉంది. దేశంలోని నేత పని వారి కష్ట నష్టాలు ఎప్పటినుంచో ఉన్నాయి. టెక్స్‌టైల్ హ్యాండ్లూమ్ మంత్రిత్వ శాఖ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 475 రిజిస్టర్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీలు ఉండగా వీటిలో నూలు నేత సంఘాలు 253 సిల్క్ సంఘాలు 50 ఊలు సంఘాలు 44 టైలర్ పవర్లూమ్ సంఘాలు 128 ఇతర సంఘాలు ఉన్నాయి. చేనేత ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే అపెక్స్ సంఘం ఆప్కో, తెలంగాణ రాష్ట్రంలో చేనేత పని వారి సామాజిక ఆర్థిక అభివృద్ధి కోసం వివిధ కేంద్ర ప్రాయోగిత రాష్ట్ర పథకాలను అమలుపరుస్తున్నారు.

చేనేత కార్మికుల సమస్యలు: ప్రభుత్వ పథకాలు వ్యవసాయం నేత పని రంగాల పట్ల చూపిన అశ్రద్ధ నిర్లక్ష్యం ఫలితంగా తెలంగాణ పేదరికంలో చిక్కుకొనిపోయి ఉంది. చేనేత పని వారు ఎదుర్కొంటున్న సమస్యలు పెట్టుబడులు పరపతి వనరులు మర మగ్గాల కోసం పోటీ మార్కెటింగ్ సౌకర్యాల కొరత మార్కెటింగ్ సహాయాన్ని అందించే యంత్రాంగం లేకపోవడం పెద్ద లోటని చెప్పవచ్చు.

నేత పని వారి స్థితి: తెలంగాణలో రైతుల ఆత్మహత్యల తర్వాత తెలంగాణలో నేత పని వారి ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సిరిసిల్ల టెక్స్‌టైల్ పరిశ్రమలో ప్రథమ స్థానంలో ఉండింది. నేత శ్రామికుల సంక్షోభాన్ని వారి సమస్యలను అర్థం చేసుకోవడంతో అవగాహన చేసుకోవచ్చు. సిరిసిల్ల నుండి చాలామంది శ్రామికులు తమ పొట్ట చేత పట్టుకొని ముంబై ప్రయాణమయ్యారు. భీమండి ముంబైలోని మార్కెట్లు పతనమవడంతో ఈ ప్రవాసులు తిరిగి సిరిసిల్లకు వచ్చి తమ సాంప్రదాయక మగ్గాలతో పని ప్రారంభించారు. 1962లో తొలి మరమగ్గాలు ప్రారంభమయ్యాయి. ఫీల్ సర్ ఛార్జ్ అడ్జస్ట్మెంట్లతో ఎఫ్ఎస్ఏ సంక్షోభం ప్రారంభమైంది. 1991లో లిబరైజేషన్ ప్రక్రియ నేత పరిశ్రమను ప్రత్యక్షంగా ప్రభావితం చేసింది. సిరిసిల్ల తక్కువ రకం పాలిస్టర్ కాటన్ దుస్తులను ఉత్పత్తి చేస్తుంది. 34వేల మర మగ్గాలలో 15 వేల మగ్గాలు కేవలం పాలిస్టర్ దుస్తులను ఉత్పత్తి చేసేవి. ఈ సెక్టార్ పై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 10,000 మంది శ్రామికులు ఆధారపడి ఉన్నారు.

నేత పని సంక్షోభం: నేత పని సంక్షోభం వెనక ఎన్నో అంశాలు ఉన్నాయి. రుణ బాధ్యతలు మార్కెట్లు ఏ నూలుకు ఎక్కువ ధర నూలు సప్లై లేకపోవడం విద్యుత్ శక్తి ధరలు పెరగడం వీటన్నిటి ఫలితంగా నిరుద్యోగిత పెరిగింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో మూడంచెలు ఉన్నాయి. ఒకటి హైదరాబాదు నుండి వ్యాపారస్తులు తమ పనిని నేత శ్రామికుడికి ఇస్తారు. రెండు నూలు ఆధారంగా మాస్టర్ వీవర్ శ్రామికులకు పని అప్పగిస్తారు. చివరకు వచ్చేది శ్రామికుడు అతని జీవితం అంతా మాస్టర్ పైనే ఆధారపడి ఉంటుంది. అతని శ్రమకు తగిన ఫలితం ఉండదు. చైనా తైవాన్ ఇతర దేశాల నుంచి దిగుమతులపై నియంత్రణ తగ్గడంతో స్థానిక నేత కార్మికులు నిరుద్యోగులుగా మారిపోయారు. పేదరికం రుణభారం వారిని మరణాల వైపు సుచేలా వేసింది. ఇతర కారణాలలో నేత కార్మికులకు నిరుద్యోగిత తక్కువ వేతనాలు తాగుడు ఆరోగ్యం పట్ల అవగాహన లోపం సాంప్రదాయక ఉత్సవాలైన పండుగలు పెళ్లిళ్లపై ఎక్కువ ఖర్చు



చేయడం మొదలైనవి సంఘటన వల్ల వారు పేదవారుగానే మిగిలిపోయారు. ఇవన్నీ కలిసి నేత శ్రామికుడి జీవితాన్ని దుర్భరం చేశాయి.

మార్కెటింగ్ పరిస్థితులు: 1997 సంవత్సరాల నుండి మర మగ్గాల మార్కెట్ పతనమవుతూ వచ్చింది. నేత పని వారు దారిద్ర రేఖకు మరి దిగువన ఉన్నారు. వీరికి మార్కెట్ లేకపోవడం నియో లివరాల్ పాలసీలు నేత పని వారి పరిస్థితులను ఇంకా దుర్భరం చేశాయి. పేదరికంతో బాధపడుతున్న నేత పని వారి కుటుంబాలు పోషకాహార లోపంతో బాధపడుతున్నాయి. వారి ఆరోగ్యం కోసం ఇతర అవసరాల కోసం అప్పులు తీసుకున్నారు. అప్పులు పెరిగే కొద్ది వారి మరింత సంక్షోభంలో పడిపోయారు. నేత మగ్గాల స్థానంలో మర మగ్గాలు మరమగ్గాల స్థానంలో జెట్ మగ్గాలు వచ్చాయి. ఈ మార్పు బివండి సూరత్ అహ్మదాబాద్ లో ఏర్పడింది. లిబరైజేషన్ ప్రక్రియ తర్వాత దేశంలోకి విదేశీ వస్త్రాలు రావడంతో నేత శ్రామికుడి పరిస్థితి మరింత దిగజారింది . ఆప్కో ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ పనిచేయడం ఆగిపోయింది జనతా క్లాత్ పథకం ఆగిపోయింది. 1991లో కోస్తా ఆంధ్ర ప్రాంతంలో పోలిస్తే తెలంగాణ నేత శ్రామికుని పరిస్థితి మరింత దమనయంగా మారింది.

ప్రభుత్వ పథకాలు: రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రతి 5 ఏళ్లకు నిదుల కేటాయింపు పెంచారు. 2007 మరియు 2008లో ఇది 150 కోట్లు కాగా నాబార్డ్ బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. నేత శ్రామికులకు క్రెడిట్ కార్డులు ఇచ్చారు. అంత్యోదయ కార్డు ద్వారా బియ్యం సప్లై చేశారు. సిరిసిల్లలోని 25వేల మంది నేత పనివారికి మరమగ్గం శ్రామికులకు తెలంగాణ ప్రభుత్వం రెండు లక్షలను ప్రకటించింది. ఈ జిల్లాలలో ఆరు



లక్షల మరమగ్గాలు 50 వేల మంది శ్రామికులు ఉన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద సిరిసిల్లలోని లబ్ధిదారులందరికీ సంవత్సరం ప్రీమియం చెల్లించింది.

తక్షణ కర్తవ్యం: ఈ విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సప్లై మార్కెటింగ్ కోసం ఉత్పత్తి శ్రామికులకు సోషల్ సెక్యూరిటీ రుణమాఫీలపై చర్యలు తీసుకోవాలి. సహకార సంఘాల ద్వారా వారి బాగోగులు చూడాలి. ఉచిత విద్య ఆరోగ్య సౌకర్యాలు నేత శ్రామికుల నమ్మకాన్ని పెంచుతాయి. టెక్స్టైల్స్ కే పరిమితమైన మార్కెట్ ను ప్రభుత్వం ఏర్పరచాలి. ప్రతి ప్రభుత్వం నేత పని వారికి మద్దతు ఇవ్వాలి . తెలంగాణ ప్రభుత్వం నేత శ్రామికుల సంక్షోభాన్ని నివారించి వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే నేతన్నలు సమాజంలో గౌరవంగా జీవిస్తారు.

పందిరి శ్రీనివాసులు.
ఎంఏ ( జాగ్రఫీ), బీఈడీ,
ఎంసీజే (జర్నలిజం)
పిజిడిసిజే (జర్నలిజం)
ఉస్మానియా
యూనివర్సిటీ.



# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ భారీ నిరసన

- 420 హామీలు -- 420 ఫిట్లు' ఫ్లెక్సీతో ఆందోళన
- కాంగ్రెస్ బాకీ కార్డుతో ప్రజల్లోకి ప్రచారం
- ప్రజల బాకీలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా 420 హామీలు -- 420 ఫిట్లుఅనే భారీ ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలుపుతూ కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజలకు పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలు చేయని హామీలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు దాదాపు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. వచ్చే నెల100 రోజులు అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, రైతులకు రైతు భరోసా, రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్న కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, పోల్నేని సత్యనారాయణ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ జావేద్, నైనేని తిరుపతిరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ ముసిపట్ల తిరుపతి రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, సరిగొమ్ముల వెంకటేష్, కందాల కొమురెల్లి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, దంసాని కుమార్, నైనేని తిరుపతి రావు, పేరాల సంపత్ రావు, యర్రం ఇంద్రసేన రెడ్డి, మరపెల్లి నవీన్ కుమార్, లండిగె లక్ష్మణ్ రావు, తక్కల్లపల్లి సత్యనారాయణ రావు, ఏడవెల్లి కొండల్ రెడ్డి, పోల్సాని రామారావు, సంగెం ఇలయ్య, దొడ్డె మమత, పోల్సాని మనోహర్ రావు, పోల్సాని తిరుపతి రావు, పమ్మిడి లింగారావు, మాది రెడ్డి వెంకట్ రెడ్డి, కడవెరుగు మోహన్, పోల్సాని సమ్మారావు, కనపర్తి లింగారావు, మడికొండ సురేందర్ రావు, తోట లక్ష్మణ్, గందే శ్రీనివాస్, వర్దినేని రవీందర్ రావు, కొలిపాక శ్రీనివాస్, ప్రతాప తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి):** స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఆర్‌సీ మండల విద్యాధికారి మంతెన హేమలత ఆధ్వర్యంలో పాఠశాలల క్రీడా సమైక్య (ఎస్‌జీఎఫ్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జమ్మికుంట మండల పరిధిలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రేమలత తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జమ్మికుంటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీన అండర్-14 మరియు అండర్-17 బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు. ఈ నెల 10వ తేదీన అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు. ఈ నెల 11వ తేదీన అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్స్ విభాగంలోపోటీలు. వయోపరిమితి అర్హతలు అండర్-14 విభాగం 01-01-2013 నాటికి లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. అండర్-17 విభాగం 01-01-2010 నాటికి లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. ఈ మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు కరీంనగర్ జిల్లాలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు జమ్మికుంట పరిధిలోని పాఠశాలలు ఈ నెల 8వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అదే రోజున డ్రా తీయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు వి. శ్రీలత, జి. రేణుక, జి. శ్రీను, హఫ్సా తదితరులు పాల్గొన్నారు. పోటీలకు సంబంధించిన ఇతర వివరాలు నమోదు కోసం జమ్మికుంట మండల కన్వీనర్ వి. ప్రేమలత జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జమ్మికుంట, ఫోన్ నెంబర్ 8099690998 ను సంప్రదించగలరని కోరారు.

## మల్లూరులో అంగరంగ వైభవంగా బోనాల పండుగ





**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 2 (సింగిడి):** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సాంస్కృతిక డప్పు వాయిద్యాలు, మహిళల కోలాహలం, భక్తి పాటల నడుమ గ్రామమంతా పండుగ శోభ సంతరించుకుంది. మంగళవారం ఉదయం నుండే మల్లూరు గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. గ్రామ మహిళలు సంప్రదాయ పద్ధతిలో తలపై బోనాలు ఎత్తుకొని, పసుపు కుంకుమలతో, వేపాకులతో అలంకరించిన కొత్త కుండలలో పొంగలి, బెల్లం, పెరుగు అన్నాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి బోనం సమర్పించి తమ కుటుంబాలను, గ్రామాన్ని చల్లగా చూడాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. డప్పు చప్పుళ్లతో, పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది.

**బోనాల పండుగ విశిష్టత..**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉంది. 'బోనం' అంటే భోజనం అని అర్థం. తెలంగాణ ఆడబిడ్డలు తమ తల్లిగారి ఇంటి నుండి తెచ్చిన బియ్యంతో వండిన అన్నాన్ని అమ్మవారికి నివేదన చేయడం ఈ పండుగ ఆనవాయితీ. ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధులు సోకకుండా, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తల్లులను వేడుకోవడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం. ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు తెలంగాణలో నెల రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈ కార్యక్రమంలో మల్లూరు గ్రామస్తులు గడ్డం చిరంజీవి, గడ్డం ప్రశాంత్, నాగరాజు, రమేష్, గుద్దేటి జంపయ్య, శ్రీను, ఎంపల్లి నాగేష్, ఎంపల్లి శ్రీను, స్థానిక మహిళలు, గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని పండుగను విజయవంతం చేశారు.

## ఖర్గేతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

### కరీంనగర్‌లో పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతంపై వివరించిన నరేందర్‌రెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్2(సింగిడి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్‌రెడ్డి ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇవి పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయని అన్నారు. కరీంనగర్ జిల్లాలో పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలను ఖర్గేకు వివరించారు.

## ఘనంగా మాజీ సీఎం డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి) :** దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర రమేష్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి మరణం రెండు రాష్ట్రా ప్రజలకు తీరని లోటుని ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంతో పాటు 108 104 ఉచిత కరెంటు ఇంద్రమ్మ ఇల్లు అనేకమైన సంక్షేమ కార్యక్రమాలు అందించిన మహా నాయకుడు అని పేర్కొన్నారు. అలాంటి మహానేత ఆకస్మిక మరణం రెండు రాష్ట్రాల ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన చేసినటువంటి సంక్షేమ పథకాలు ఇప్పటికి కొనసాగుతున్నాయని ఆ మహానీయుడి ని రెండు రాష్ట్రాల ప్రజలు ఇప్పటికీ గుండెల్లో పెట్టుకొని చూసు కుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్యా జిల్లా కార్యదర్శి పొనగంటి రవీందర్ పొనగంటి మల్లయ్య కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్స్ చందరాజు ఒగ్గు రమేష్ కుతాడి తిరుపతి ఎగిత అశోక్ పొనగంటి విష్ణు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ పాత ప్రసాద్ శీలం అశోక్ యండి సజ్జు పంజాల అజయ్ పోతుల శ్రీనివాస్ మరెపల్లి అజేయ్ మెట్టు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్‌లో సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్స విజయవంతం

**మెదడులో రక్తస్రావం, అన్యురిజంతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన 60 ఏళ్ల మహిళకు సకాలంలో చికిత్స**

**న్యూరో శస్త్రచికిత్స నిపుణుడు డా.రాజీవ్‌రెడ్డి**



**కరీంనగర్, సెప్టెంబర్ 2(సింగిడి):** మెదడులో రక్తస్రావంతో పాటు అన్యురిజం కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన 60 ఏళ్ల మహిళకు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉండటంతో పాటు తన రోజువారీ పనులను తానే చేసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లికి చెందిన కౌసల్య రోజువారీ పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు తొలుత సమీప ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ మెడికవర్‌కు తీసుకువచ్చారు. అపస్మారక స్థితిలో చేరిన ఆమెకు అత్యవసరంగా సీటీ స్కాన్ నిర్వహించగా మెదడులో రక్తస్రావం ఉన్నట్లు గుర్తించారు. తదుపరి పరీక్షల్లో మెదడులోని రక్తనాళంలో అన్యురిజం ఉన్నట్లు నిర్ధారించారు. రక్తనాళం గోడ బలహీనపడటంతో ఒక ప్రాంతంలో బెలూన్‌లా ఉబ్బే పరిస్థితిని అన్యురిజం అంటారని, అది చిట్లినప్పుడు మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాపాయం ఏర్పడుతుందని వైద్యులు తెలిపారు. కౌసల్య పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా ఉండటంతో ఆలస్యం చేస్తే ప్రాణాలతో పాటు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సమ్మతితో అత్యవసరంగా సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్స నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో సకాలంలో చికిత్స అందించగలిగామని వైద్యులు తెలిపారు. కౌసల్య కుమారుడు మహేష్ మాట్లాడుతూ, తల్లి పరిస్థితి చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యామని, అయితే మెడికవర్ వైద్యులు అత్యవసరంగా స్పందించి క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడంతో ప్రస్తుతం ఆమె సాధారణ స్థితికి చేరుకుని తన పనులు తానే చేసుకుంటున్నారని తెలిపారు. ఆస్పత్రి కేంద్ర అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యూరో శస్త్రచికిత్స నిపుణుడు డా. రాజీవ్‌రెడ్డి, మత్తు వైద్య విభాగం అధిపతి డా. వినయ్, అత్యవసర వైద్య విభాగం డా. సత్యనారాయణ, ఆస్పత్రి పర్యవేక్షకురాలు డా. ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# పురోహితుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండ

**ప్రసాదాచార్యుల సంతాప సభలో పాల్గొన్న పాడి కౌశిక్ రెడ్డి**



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి) :** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రముఖ వేద పండితులు సముద్రాల ప్రసాదాచార్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి బుధవారం వారి స్వగృహానికి చేరుకొని ప్రసాదాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షణ సహాయ కింద ఆ కుటుంబానికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, జమ్మికుంట మండలం తో పాటు ఓదెల మండలం లో కూడా తన పౌరోహిత్యం తో ఎంతోమంది కుటుంబాలకు దగ్గరగా ఉన్న ప్రసాదాచార్యులు చిన్న వయసులో అనారోగ్యంతో మృతి చెందడం తనకు ఆవేదనను కలిగించిందని తన పూజలతో ఎంతోమందిని ఆకట్టుకున్నారని ఆయన ఆకస్మిక మరణం ఆ కుటుంబంతో పాటు ఈ రెండు మండలాల ప్రజలకు తీరని లోటు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు.

**అందరి మేలు కోరే వ్యక్తి ప్రసాదాచార్యులు - కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్**

విలాసాగర్ గ్రామంలో సముద్రాల ప్రసాదాచార్యుల సంస్మరణ సభలో పాల్గొన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ మాట్లాడుతూ, సుమారు 30 సంవత్సరాలకు పైగా పౌరోహిత్యం నిర్వహిస్తూ ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచిన ప్రసాదాచార్యులు అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం తమను కలిచి వేసిందని ఎలాంటి పూజ నైనా పవిత్రంగా చేస్తూ అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడని ఆయన లోటు ఎవరు తీర్చలేనిదని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని వేడుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటానని వారి కష్టసుఖాలను పాలు పంచుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సముద్రాల కిషోరాచార్యులు తిప్పారపు శ్రీనివాస్ వజ్జపల్లి శ్రీనివాస్ రాచపల్లి వంశీ బిట్ల రాజేందర్ చిలుక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**రోగులకు పరీక్షలు ఉచిత మందులు అందించిన యజమాన్యం**




**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులైన ఆదిత్య,అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లి గ్రామం లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటర్ ఎలక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, జమ్మికుంట ఆదిత్య అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ జనరల్ మెడిసిన్, డాక్టర్ భరత్ న్యూరాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ గైనకాలజిస్ట్ ల చే వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకి ఉచిత షుగర్ పరీక్షలు అవసరమైన మందులు ఉచితంగా అందించడం జరిగిందని పేర్కొన్నారు. మేము అందించిన సేవలకు మాకు సహకరించిన మర్రివానిపల్లి గ్రామ సర్పంచ్ మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కడారి పద్మ -నవీన్ వార్డు కౌన్సిలర్లు జుజాటి శ్రీవాణి, ఎడ్ల చిరంజీవి, ఎరుబాటి నాగరాజు, రౌతు రాజేష్, కోడం సంజీవ్, బైరి రవీందర్, ఏనుగు శోభారాణి ఇతర గ్రామ పెద్దలకు ఆదిత్య అమృత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాలలో ఏర్పాటుచేసి ఉచిత వైద్య సేవలతో పాటు మందులను అందిస్తామని ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఆదిత్య అమృత ఆసుపత్రుల లక్ష్యమని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# ఉద్యోగానికి పదవీ విరమణ ఉంటుంది.. సేవలకు ఉండదు

**పంచాయతీరాజ్ శాఖలో 43 ఏళ్ల విశిష్ట సేవలు అందించిన జగన్మోహన్‌రెడ్డికి ఘన సన్మానం**



**కరీంనగర్, సెప్టెంబర్ 2(సింగిడి):** పంచాయతీరాజ్ శాఖలో 43 ఏళ్లపాటు వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఎంపీడీవో చెక్కబండి జగన్మోహన్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం కరీంనగర్‌లోని టీఎన్జీవోస్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి గ్రామీణ అభివృద్ధి అధికారిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, అనంతరం పంచాయతీ కార్యదర్శి, మండల పంచాయతీ అధికారి, ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి ఆదర్శ ఉద్యోగిగా నిలిచారని పలువురు కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే అవకాశం ఉద్యోగులకు అదృష్టం, వరం వంటిదన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు ప్రజలతో నేరుగా మమేకమై సేవలందించే అవకాశం ఈ శాఖ ద్వారా లభిస్తుందని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి 43 ఏళ్ల సుదీర్ఘ సేవా కాలంలో ఎలాంటి మచ్చ లేకుండా గౌరవప్రదంగా పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ హోదాకు మాత్రమే పదవీ విరమణ ఉంటుందని, చేసిన సేవలకు, సంపాదించుకున్న అభిమానానికి, ప్రజల హృదయాల్లో పొందిన స్థానానికి పదవీ విరమణ ఉండదన్నారు. జగన్మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి, సహోద్యోగులు, ప్రజలతో మమేకమైన తీరు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగం లక్ష్మణరావు, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఈ. శారద, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు, జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేద్దాం మరో ఇద్దరికి చూపును ప్రసాదిద్దాం

**బూరుగుపల్లి కిరణ్ చూపు సజీవం**

**నేత్ర దాత కుటుంబాన్ని అభినందించిన సదాశాయ ఫౌండేషన్**



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వాడకు చెందిన బూరుగుపల్లి కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కిరణ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సదాశాయ ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను కలిసి నేత్రాలు దానం చేయాలని సూచించగా కుటుంబ సభ్యుల సహకారంతో కిరణ్ నేత్రాలను సదాశివ ఫౌండేషన్ ద్వారా ఎల్వీప్రసాద్ ఐ ఆసుపత్రికి దానం చేశారు. బుధవారం కిరణ్ స్వగ్రామానికి చేరుకున్న సదాశాయ ఫౌండేషన్ సభ్యులు సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు మేమేంటో అందించారు. ఈ సందర్భంగా సదాశాయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి మాట్లాడుతూ, నేత్రదానంపై అనవసరమైన అపోహలు పడవద్దని మనం చనిపోయిన తర్వాత మన నేత్రాలను దానం చేయడం వల్ల మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన వారిమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశియ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు ముత్యాల జగదీశ్వర్ చతురాల శ్రీనివాస్ మంగళ రమేష్ క్యాతం రవి ఇల్లందుల సమ్మయ్య వరగంటి సదానందం బూరుగుపల్లి రాము సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు కన్నీరు తుడిచిన మహానేత వైఎస్ఆర్

**మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని**



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి) :** పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రైతుల కన్నీళ్లు తురుస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ సుస్థిర పాలన అందించిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు అన్నారు. మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా హుజరాబాద్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మిఠాయిలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి 108 అంబులెన్స్ ఏర్పాటు చేయడం ఆయన గొప్పతనమని అన్నారు. అంతేకాకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించారని రైతులకు ఉచిత విద్యుత్ ను అందించి వారికి అండగా నిలిచారని రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ మన ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులతో పాటు పలువురు నేతలు మహిళా నేతలు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వరుస నిరసనలు
- భారీ ఎత్తున కార్యక్రమాలకు పిలుపు
- నల్లగొండలో మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి సెప్టెంబర్ 2( సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలను ఎండగడుతూ బీఆర్ఎ స్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వరుస ని రసన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లో విఫలమైందని ఆరోపించిన భూపాల్‌రెడ్డి.. బీఆర్ఎస్ ప్రకటిం చిన ఏడు రోజుల నిరసన కార్య క్రమాలను విజయవంతం చేయా లని పార్టీ నాయకులు, కార్యకర్త లు, ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 2న నల్లగొండ గడియా రం సెంటర్‌లో భారీ మానవహా రం నిర్వహించనున్నారు. 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శనతో పా టు బాకీ కార్డుల పంపిణీ చేపట్ట నున్నట్లు భూపాల్‌రెడ్డి వెల్లడిం చారు. 3న జిల్లా వ్యాప్తంగా మం డల కేంద్రాల్లోరైతు సదస్సులు ని ర్వహించనున్నారు. అనంతరం మిర్యాలగూడలో జరిగే కేటీఆర్ రైతు సదస్సుకు నాయకులు, కా ర్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. 4వ తేదీన వి ద్యార్థులు, మహిళలు, దివ్యాం గులతో కలిసి ప్రభుత్వ జూనియ ర్ కళాశాల వద్ద వంటావార్పు కా ర్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, విద్యా ర్థుల తో భారీ ర్యాలీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెం డర్ అమలు తదితర డి మాండ్ల పై సెప్టెంబర్ 5నఎన్జీ కళాశాల నుంచి గడియారం సెంటర్ వరకు యువత, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇక సెప్టెంబర్ 6న ఎన్జీ కళాశాల నుం చి నల్లగొండ నగర వీధుల మీదుగా ఆటోలతో ర్యాలీ చేపట్ట నున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపా రు. అదే విధంగా సెప్టెంబర్ 7న నల్లగొండ, తిప్పర్తి, కనగల్, మా డుగులపల్లి ప్రాంతాల్లో నిర్వ హిం చే ప్రజావాణి కార్యక్రమాల్లో వి నతిపత్రాలు అందజేయనున్నా రు. ఏడు రోజు ల నిరసన కార్యక్ర మాలకు ముగింపుగా సెప్టెంబర్ 8న మర్రిగూడ బైపాస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహా నికి 420 హామీలతో కూడిన విన తిపత్రం అందజేయనున్నారు. అ నంతరం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కా ర్యాలయంలో మీడియా సమావే శం నిర్వహించ నున్నట్లు భూపా ల్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్ర మాల్లో ప్రజలు, బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల ని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బం డా నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు కటికం సత్తయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, బక్క పి చ్చయ్య, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీలు కరీంపాషా, నా రబోయిన బిక్షం, మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి, నగర పా ర్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండ ల పార్టీ అధ్యక్షులు దేప వెంకట రెడ్డి, అయితగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, కార్పొరేట ర్లు, పార్టీ నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా పథకాన్ని కొనసాగించాలి



### రెడ్డి కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించి వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్

### రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి

**కరీంనగర్, సెప్టెంబర్2(సింగిడి):** రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని, పేద రెడ్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బండ గోపాల్‌రెడ్డితో కలిసి 'రెడ్ల నిరసన దీక్ష' గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయడంతో పాటు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను అన్ని ప్రభుత్వ విభాగాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం చేపడుతున్న ఈ దీక్షకు ప్రతి గ్రామం నుంచి కనీసం ఒక రెడ్డి కుటుంబ సభ్యుడు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, కోట రంగారెడ్డి, పెండ్యాల సమ్మిరెడ్డి, మ్యకల తిరుపతిరెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, పలుగు సమ్మిరెడ్డి, కాశం రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొత్తిరెడ్డి మహేందర్‌రెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## భూ సేకరణ సర్వేని పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ, సెప్టెంబర్ 2( సింగిడి):** హాసన్‌పర్తి మండలం కోమిటిపల్లి రైల్వేకు కావలిసిన సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమితో పాటు జయిగిరి లోని రైల్వే ట్రాక్ సమీపంలో నిర్మించ తలపెట్టిన ఆర్వోబబీ, ఆర్యుబీ లకు కావాలిసిన భూమి కోసం జరుగుతున్న సర్వే పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. అనంతరం భీమారం శివారు లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి సంబంధిత రెవిన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కుడా, రెవిన్యూ, రైల్వే అధికారులతో కలెక్టర్ రైల్వేశాఖకి సంబందించిన భూ సేకరణ అంశాల మీద చర్చించి తగు సూచనలను ఇచ్చారు. ఈ సమావేశం లో ఆర్డీవో వెంకటేశ్వర్లు, కుడా పీ ఓ అజిత్ రెడ్డి, ఐ ఆర్ ఎస్ ఈ సైలేష్, డీ వై ఎస్ ఓ ప్రశాంత్, జిల్లా మత్స్య శాఖ అధికారి పిల్లి శ్రీపతి, ఆర్ అండ్ బి ఈ ఈ చరణ్, ఎం పీ డీ సి ఎల్ ఎస్ ఈ సామ్య నాయక్, ,రైల్వే అసిస్టెంట్ ఎక్సక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యలపై జేఏసీ పోరుబాట

- పెండింగ్ నిధులు విడుదల చేయాలి
- జీపీల జనరల్ ఫండ్‌పై ఫ్రీజింగ్ ఎత్తివేయాలి
- అన్ని గ్రామపంచాయతీలకు సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలి



**ఆలేరు, సెప్టెంబర్ 2( సింగిడి):** గ్రామపంచాయతీలు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ ఫోరం జేఏసీ నిర్ణయించింది. జిల్లా సర్పంచ్ ఫోరం జేఏసీ అధ్యక్షుడు జుకంటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ సర్పంచుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సర్పంచుల జేఏసీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సి) నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల నుంచి వివిధ పనుల రూపంలో వసూలు చేసిన జనరల్ ఫండ్‌ను ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీజింగ్‌ను తొలగించి, గ్రామపంచాయతీల నిధులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**అన్ని గ్రామాలకు సమాన నిధులు**

నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీలను సమానంగా అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎలాంటి పక్షపాతం లేకుండా అభివృద్ధి నిధులు కేటాయించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు నిధులు అందితేనే మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడం, విద్యుత్ వోల్టేజ్ సమస్యలు తదితర కారణాలతో సర్పంచులపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉన్నప్పటికీ, తగిన నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**త్వరలో జిల్లా స్థాయి సభ**

జిల్లాలోని అన్ని మండలాల్లో సర్పంచుల జేఏసీ కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని నాయకులు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో భారీ సభ నిర్వహించి గ్రామపంచాయతీలు, సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రకటించారు.

**మండలాల వారీగా అధ్యక్షుల ఎన్నిక**

ఈ సందర్భంగా రాజాపేట మండల జేఏసీ అధ్యక్షుడిగా పల్లె సంతోష్ గౌడ్, యాదగిరిగుట్ట మండలానికి గౌడ మహేందర్, తుర్కపల్లి మండలానికి సీతరాజు, బొమ్మలరామారం మండలానికి గుడిమామిడి వెంకటేష్, గుండాల మండలానికి గడ్డమీది మహోదయ గౌడ్, ఆత్మకూర్ మండలానికి ఎర్ర సోమిరెడ్డి, మోటకొండూర్ మండలానికి బెల్లి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కూర వెంకటేష్, ఆయా మండలాల సర్పంచ్ ఫోరం జేఏసీ నాయకులు, ఆలేరు మండల సర్పంచులు ధూపాటి వెంకటేష్, పరిధి మమతా సంతోష్, నర్సయ్య, బేధారబోయిన యాకమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి) :** జన సేన పార్టీ అధ్యక్షులు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద జన సేన నాయకులు, అభిమానులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జన సేన పార్టీ నాయకులు రాసమల్ల శేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో కూడా జన సేన పార్టీ తన సేవలను అందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో జన సేన పార్టీ రాజకీయ ఆరంగ్రటం చేస్తుందని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే శాసనసభ ఎన్నికల్లో జన సేన పార్టీ తెలంగాణలో పోటీ చేస్తుందని జన సేన పార్టీ గెలుపు కోసం ఇప్పటినుండే ప్రతి కార్యకర్త ఒక సైనికుడి వలె పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడు ఆశీస్సులు పవన్ కళ్యాణ్ పై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో జన సేన పార్టీ నేతలు కండెం వంశీ మంద వేణు కుమారస్వామి రాకేష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నివారణకు చర్యలు



**హన్మకొండ, సెప్టెంబర్ 2 (సింగిడి):** నగరంలోని హంటర్ రోడ్డు అదాల జంక్షన్ నుండి నీలిమ జంక్షన్ వరకు గల ప్రాంతంలో ట్రాఫిక్ నివారణ చర్యలను చేపడుతున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏ సీ పీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైన పేర్కొన్న ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థుల సురక్షిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, అలాగే ఆర్ అండ్ బీ శాఖ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారనీ తెలిపారు. పరిశీలన అనంతరం, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం న్యూ సైన్స్ కాలేజ్‌కి కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను ఈ నెల 4వ తారీఖు నుండి తాత్కాలిక, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయడం జరుగుతుందన్నారు. దీనికి ,ట్రై సిటీ ప్రజలు వాహనదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఏ సీ పీ విజ్ఞప్తి చేశారు.

# డ్రైనేజీ వ్యవస్థ రూపురేఖలు మారుస్తాం

- సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, సెప్టెంబర్ 2( సింగిడి):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 1వ, 65వ డివిజన్, 66వ డివిజన్లలో రూ 3,75 కోట్ల వ్యయంతో కూడిన సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 20 నుంచి 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్ల సమస్య,డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దశల వారీగా అన్ని డివిజన్లో,అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చేపడతమన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారన్నారు. గత రెండు సార్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని దద్దమ్మలు అసత్య ప్రచారాలతో కాలం వెల్లబుచుతున్నారని మండిపడ్డారు. ఎక్కడ సమస్యలు ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ కి సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము, 65వ డివిజన్ అధ్యక్షులు సునీల్, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,హసన్పర్తి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి,హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకటరెడ్డి, హసన్పర్తి మండల అధ్యక్షులు అశోక్, హసన్పర్తి మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి,66వ డివిజన్ మాజీ అధ్యక్షులు కనపర్తి కిరణ్,మండల మహిళ ఉపాధ్యక్షురాలు స్వాతి,సీనియర్ నాయకులు దేవరకొండ అనిల్,చంటి రెడ్డి,ఎర్ర ప్రకాష్,శ్రీకాంత్ రెడ్డి, విసం సురేందర్ రెడ్డి, భాషా, వేణు, కుమారస్వామి, వెంకటస్వామి,ఆనంద్, ఎల్ఐసి వెంకన్న, నరసింహ, రాములు, శ్రీనివాస్,డివిజన్ల ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ పోరుబాట

### పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలి: భూపాల్‌రెడ్డి



**కోదాడ, సెప్టెంబర్ 2( సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న కోదాడలో నియోజకవర్గ స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు నల్లా భూపాల్‌రెడ్డి తెలిపారు. అనంతగిరి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలుకు ఒత్తిడి తెచ్చేందుకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ అఫ్జల్, సీనియర్ నాయకులు పందిరి వీరయ్య, శాంతినగర్ గ్రామశాఖ అధ్యక్షుడు అక్బర్, కొత్తపల్లి ఏసు, పల్లపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ పంటల స్థానంలో లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు

- ఆత్మ పథకం ద్వారా రైతులకు శిక్షణ
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాపురావు





**మహదేవపూర్ సెప్టెంబర్ 2( సింగిడి):** సాంప్ర దాయ పంటల స్థానంలో లాభదాయకమైన ప్రత్యా మ్నాయ పంటలు సాగు చేసి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాపురావు అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం రైతు వేదికలో ఆత్మ పథకం ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న వ్యవసాయ విస్తరణ సబ్ మిషన్ క్రింద రాష్ట్ర విస్తరణ కార్యక్రమాలకు మద్దతు, సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ పథకంలో భాగంగా పూర్వజ్ఞాన గుర్తింపు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ అనుభవం ద్వారా సంపాదించిన సంప్రదాయ మరియు ఆచరణాత్మక నైపుణ్యాలను అధికారికంగా గుర్తించి వాటిని మరింత మెరుగుపరిచే ఒక ప్రత్యేక శిక్షణ , ఇందులో నేల తయారీ, విత్తన శుద్ధి, విత్తడం, ఎరువుల యాజమాన్యం, పురుగుల నివారణ, యంత్రాల వినియోగం, నీటిపారుదల, కోతలు, మార్కెటింగ్ లాంటి ప్రతి వ్యవసాయానికి పని నైపుణ్యం మరియు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమని తెలిపారు. రైతులు తమ సాంప్రదాయ పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తున్నప్పటికీ ఆధునిక సాంకేతికతతో వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి పూర్వ జ్ఞాన గుర్తింపు తోడు అవుతుందని వివరించారు. రైతులు అవసరమైన జ్ఞానాన్ని సాంకేతికతను, నైపుణ్యాలను, మార్కెట్ సమాచారాన్ని, సాగు ద్వారా పొందే నికర ఆదాయాన్ని సుస్థిరంగా పెంపొందించుకోవాలని సూచించారు. రసాయనాలు లేని సహజ సిద్ధమైన సాగు పద్ధతులను ప్రోత్సహించడం వాతావరణ మార్పులను తట్టుకునే పంటలు మరియు సాంకేతికతను పాటించడం సాంప్రదాయ పంటల స్థానంలో లాభదాయకమైన మరియు ప్రత్యామ్నాయ పంటలను వేయడం, సకాలంలో చీడపీడల వ్యాప్తిని పసిగట్టి యాజమాన్య పద్ధతులు చేపట్టడం నేల స్వభావం ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని పెంపొందించుకోవడం, సాగులో డిజిటల్ సాంకేతికతలు మరియు యాప్ల వినియోగాన్ని, సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక వ్యవసాయ సాంకేతి కథలు సరికొత్త సాగు పద్ధతులు మార్కెటింగ్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో క్షేత్ర సందర్శన నిర్వహించి ప్రత్తిలో ఆకు మచ్చ పురుగు, రసం పీల్చే పురుగుల బెడదకు, వరి పంటలు ఆశించే చీడపీడలకు నివారణ చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీపాల్, ఎంఏఓ శ్రీజ, ఉద్యానవన అధికారిని మణి, స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి, కన్నెపల్లి సర్పంచ్ సంజీవరెడ్డి, తోపాటు ఏఈఓ రాంబాబు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలి.. పాత పెన్షన్ పునరుద్ధరించాలి...



**కోదాడ, సెప్టెంబర్ 2( సింగిడి):** సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1ను సీపీఎస్ విద్రోహ దినంగా పాటించారు. ఇందులో భాగంగా మంగళవారం అనంతగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత లేకుండా చేస్తోందని, ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాకర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రావు, కోదాడ డివిజన్ ప్రధాన కార్యదర్శి పోలంపల్లి వెంకటనగేష్, ఉపాధ్యక్షుడు విక్రమ్, మీరా, మాధవీ, లక్ష్మారెడ్డి, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాదాచార్యుల కుటుంబానికి మిత్రుల ఆర్థిక చేయూత



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (సింగిడి):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రముఖ వేద పండితుడు సముద్రాల ప్రసాదాచార్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాదాచార్యుల సన్నిహితులు సహచర విద్యార్థుల బృందం అందరు కలిసి రెండు లక్షల రూపాయలను సేకరించి ప్రసాదాచార్యుల కుటుంబానికి అందజేశారు. బుధవారం విలాసాగర్ గ్రామంలో జరిగిన సంతాప సభకు హాజరైన మిత్రబృందం సన్నిహితులు రెండు లక్షల రూపాయల చెక్కును మృతుడు కుటుంబ సభ్యులకు అందించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో భవిష్యత్తు కలిగిన ప్రసాదాచార్యులు అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరంగా ఉందని ఆయన మృతిని తట్టుకోలేకపోతున్నామని భవిష్యత్తులో ఆ కుటుంబానికి ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ప్రసాదాచార్యుల కుమార్తె పేరు మీద రెండు లక్షల రూపాయలు డిపాజిట్ చేయడానికి మిత్రులందరికీ సహకరించి వారి సహాయాన్ని అందించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మిత్ర బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ తోపాటు తిప్పారపు సుధాకర్ రావు తిప్పారపు శ్రీనివాస్ తిప్పారపు పురుషోత్తం నూక శ్రీనివాస్ చిరంజీవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : నేరెళ్ల దేవరాజు



**సూర్యాపేట ప్రతినిధి సెప్టెంబర్ 2( సింగిడి):** 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత ప్రభుత్వం ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టి జి సి పి ఎస్ ఈ యు సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల దేవరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట మండలం ఏనుబాముల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో సిపిఎస్ అమలులోకి వచ్చిన రోజును చీకటి దినంగా భావిస్తూ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శి ంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఎన్ని కల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ ను పునరుద్ధ రించాలన్నారు. ఉపాధ్యాయులకు సామాజిక భద్రత అందించవలసిన బాధ్య త రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు భరణి కుమార్,శ్రీనివాస్, ఝాన్సీ, మహాలక్ష్మి, వెంకన్న, నాగరాజు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిపుణుల అభిప్రాయం ప్రకారం, అర్జున బెరడులో వివిధ యాంటీఆక్సిడెంట్లు, టానిన్లు ఉంటాయి. ఈ సమ్మేళనాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది గుండెను బలోపేతం చేస్తుందని, రక్త నాళాలను శుభ్రపరుస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అర్జున బెరడుతో తయారుచేసిన కషాయం లేదా నీటిని మీరు తాగొచ్చు. ఇది సిరల్లో పేరుకుపోయిన చెత్తను క్రమంగా తొలగిస్తుంది.

# అర్జున బెరడు ఆరోగ్య ప్రయోజనాలు తెలుసా..?

## చెడు కొలెస్ట్రాల్, గుండె సమస్యలపై గాండీవం..!

అర్జున బెరడు కషాయం గుండెకు చాలా ప్రయోజనకరం. ఇది గుండె కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఇంకా, మెరుగైన రక్త ప్రవాహం గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అర్జున బెరడు అధిక రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయకారిగా పనిచేస్తుంది. ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని తీసుకునే ముందు మీరు నిపుణుడిని సంప్రదించాలి. ఎందుకంటే ఇది ప్రయోజనాలు, అప్రయోజనాలు రెండింటినీ కలిగి ఉంటుంది.


**అర్జున బెరడును ఎలా ఉపయోగించాలి..**

అర్జున బెరడు పొడి ఒక టీ స్పూన్ తీసుకోవాలి. దీనికి ఒక గ్లాస్ నీరు తీసుకోవాలి. ముందుగా అర్జున బెరడు, లేద పొడిని తీసుకుని ఒక గ్లాసు నీటిలో వేసి రాత్రంతా నానబెట్టండి. ఉదయం 7 నిమిషాల పాటు సన్నని మంటమీద మరిగించాలి. ఆ తరువాత దానిని వడకట్టి ఖాళీ కడుపుతో గోరువెచ్చగా తాగండి. 6 నుండి 8 వారాల పాటు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తేడా కనిపిస్తుంది.


**అర్జున బెరడు ప్రయోజనాలు:**
అర్జున బెరడులో ఫ్లేవనాయిడ్స్, టానిన్లు, ట్రైటెర్పెనాయిడ్స్, సపోనిన్లు వంటి ఫైటో కెమికల్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో పాటుగా, అర్జునోలిక్ యాసిడ్, గల్లిక్ యాసిడ్, ఎలాజిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అర్జున్ బెరడులో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ లక్షణాలు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో సాయపడతాయి. అర్జున బెరడు అధిక రక్తపోటును నియంత్రిస్తుంది.

అంతేకాదు.. తరచుగా విరేచనాలు, జీర్ణసమస్యలతో బాధపడేవారికి అర్జున బెరడు మంచి ఔషధంగా పనిచేస్తుంది.. ఇందులో ఉండే టానిన్లు అస్ట్రింజెంట్ లక్షణాల్ని కలిగి ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడంలో సాయపడతాయి. పైగా కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శరీరంలోని మంట, వాపుని తగ్గిస్తుంది.

**ఎవరు జాగ్రత్తగా ఉండాలి?**
నిపుణుల అభిప్రాయం ప్రకారం, గుండె లేదా రక్తపోటు మందులు తీసుకునేవారు దీనికి దూరంగా ఉండాలి. మీరు దీన్ని తాగాలనుకుంటే, వైద్యుడిని సంప్రదించండి.



## వ్యాపార రహస్యాల చోరీ..
# ఓపెన్‌ఏఐపై యాపిల్ దావా




గోప్యత విషయంలో టెక్‌సంస్థలు యాపిల్ – ఓపెన్ ఏఐ మధ్య నెలకొన్న పోటీ తాజాగా తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ఓపెన్ ఏఐపై యాపిల్ దావా వేసింది (ూాజూాజూాశ్రీవూాబవం ూాజూావఆూా×). ఈ ఏఐ సంస్థ తమ వాణిజ్య రహస్యాలను దొంగిలించిందని తన దావాలో ఆరోపించింది. ఓపెన్ ఏఐతో సహా యాపిల్‌లో పనిచేసిన ఇద్దరు మాజీ ఉద్యోగులపైనా చట్టపరమైన చర్యలకు దిగింది. డిజైన్, తయారీ ప్రక్రియ, సరఫరా గొలుసు వ్యూహాలతో సహా యాపిల్‌కు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీరంతా కలిసి పనిచేశారని ఆరోపించింది. తమ సంస్థ నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆ ఉద్యోగులు కంపెనీ ల్యాప్‌టాప్‌లను తిరిగి ఇవ్వలేదని యాపిల్ పేర్కొంది. ఆ తర్వాత అందులోని ఓ బగ్ సాయంతో తమ ఇంటర్నల్ నెట్‌వర్క్‌లోకి చొరబడి సున్నితమైన రహస్యాలను తెలుసుకున్నారని తెలిపింది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐకి హార్డ్‌వేర్ చీఫ్‌గా ఉన్న టాన్.. గతంలో యాపిల్‌లో పనిచేశారు. ఆయన యాపిల్ నుంచి వెళ్లపోవడానికి ముందు సప్లయిర్ల సమాచారం, సంస్థకు సంబంధించిన అంతర్గత వివరాలను తన ఈమెయిల్‌కు పంపించుకున్నారు. ఏఐ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకు రహస్య సమాచారాన్ని పద్ధతి ప్రకారం ఉపయోగించుకున్నారని దావాలో యాపిల్ ఆరోపించింది.
ఓపెన్‌ఏఐలో జరిగే ఇంటర్వ్యూల్లో ‘షో అండ్ టెల్’ సెషన్‌ల కోసం అప్పటి యాపిల్ ఉద్యోగులను విడిభాగాలను తీసుకురావాలని టాన్ ప్రోత్సహించినట్లు పేర్కొంది. ప్రస్తుతం 400 మంది మాజీ ఉద్యోగులు ఓపెన్‌ఏఐలో పనిచేస్తున్నారని వెల్లడించింది. తమ వద్ద హార్డ్‌వేర్ రంగంలోని వాణిజ్య రహస్యాలకు సంబంధించిన విభాగాల్లో పనిచేసిన ఉద్యోగులు.. ఇప్పుడు ఆ వివరాలను ఓపెన్‌ఏఐలో ఉపయోగించుకోవడానికి హక్కు ఉండదని పేర్కొంది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ రంగంలోకి వేగంగా అడుగులు వేస్తోంది. దానిలో భాగంగా హార్డ్‌వేర్ స్టార్టప్ ఐఓ ప్రొడక్ట్స్‌ను సొంతం చేసుకునేందుకు 6.5 బిలియన్ డాలర్లను వెచ్చించింది. దానిని యాపిల్ డిజైనర్ జానీ ఐవ్ స్థాపించారు. అయితే అతడి పేరును యాపిల్ దావాలో చేర్చలేదు.
ఏఐ ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో నెలకొన్న పోటీతో రెండు సంస్థల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తమ గోప్య సమాచారం ఏఐకి చేరుతుందనే ఆందోళన నేపథ్యంలో చర్చిద్దామని అడిగామని, కానీ ఓపెన్ ఏఐ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని యాపిల్ తన ఫిర్యాదులో పేర్కొంది.

# ఇకపై వాట్సప్ ఫార్వర్డ్, స్క్రీన్‌షాట్ టికెట్స్ చెల్లవు: రైల్వే శాఖ

రైలు ప్రయాణం సమయంలో టికెట్లను టీటీఈలు తనిఖీ చేయడంపై భారతీయ రైల్వే శాఖ కీలక ప్రకటన చేసింది. వాట్సప్ ఫార్వర్డ్ లేదా స్క్రీన్ షాట్ తీసిన టికెట్లు ఇకపై చెల్లబోవని స్పష్టం చేసింది. ఒరిజినల్ టికెట్లనే అనుమతిస్తామని పేర్కొంది. టికెట్ దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

రైల్వే టికెట్ వెరిఫికేషన్ సమయంలో వాట్సప్‌లో షేర్ చేసిన లేదా స్క్రీన్‌షాట్ టికెట్‌లను టీటీఈలు అనుమతించబోరని రైల్వే శాఖ పేర్కొంది. వీటిని ఎడిట్ లేదా ట్యాంపరింగ్ చేసే ప్రమాదం ఉందని, ఒకే టికెట్‌ను పలువురికి




ఫార్వర్డ్ చేసే అవకాశం ఉందని తెలిపింది. వీటిని అరికట్టడంలో భాగంగా ఇకపై రైల్వే బుకింగ్ ప్లాట్‌ఫాం ద్వారా కొనుగోలు చేసే ఇ–టికెట్‌లు లేదా చెల్లుబాటు అయ్యే ప్రింటెడ్ టికెట్లనే అనుమతిస్తామని స్పష్టం చేసింది.

**వాట్సప్ ఫార్వర్డ్ లేదాద స్క్రీన్‌షాట్‌లనే చూపిస్తే..**

ప్రయాణికులు కేవలం వాట్సప్ స్క్రీన్‌షాట్స్ లేదా ఫార్వర్డ్ మెసేజ్‌లను చూపిస్తే.. వారిని టికెట్ లేని ప్రయాణికులుగా పరిగణిస్తారు. ఆ సమయంలో ఆ ప్రయాణికులు కొత్త టికెట్ కొనాల్సి ఉంటుంది. జరిమానాతో పాటు రైల్వే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కొవాల్సి ఉంటుంది. టికెట్ తనిఖీ సమయాల్లో ఉండాల్సినవి ఐఆర్‌సీటీసీ కనెక్ట్ యాప్‌లో బుక్ చేసిన ఇ–టికెట్ ఉండాలి. టికెట్ బుకింగ్ సమయంలో మొబైల్‌కు వచ్చే కన్ఫర్మేషన్ మెసేజ్. ఒరిజినల్ ఇ–టికెట్ ప్రింటెడ్ కాపీ (అవసరమైతే) తీసుకోవాలి. టికెట్‌తో పాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలి

స్టాక్ మార్కెట్
Stock Market

# హైదరాబాద్‌లో పెట్‌ఫోక్ వెటర్నరీ సేవల ప్రారంభం




దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెట్ కేర్ బ్రాండ్ ‘పెట్‌ఫోక్’ వెటర్నరీ హెల్త్‌కేర్ సేవల్లోకి అడుగుపెట్టింది. కంపల్లిలోని పెట్‌ఫోక్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌లో త్వరలో వెటర్నరీ కన్సల్టేషన్, టీకాలు, నివారణ ఆరోగ్య సేవలు ప్రారంభం కానుండగా, బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన వెటర్నరీ పాడ్ కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా పెట్‌ఫోక్ వ్యవస్థాపకుడు, సీఈఓ లక్ష్మీకాంత్ పుడుచెర్రి మాట్లాడుతూ, పెంపుడు జంతువులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు వెటర్నరీ విభాగాన్ని ప్రారంభించామని తెలిపారు. వెటర్నరీ విభాగ విస్తరణకు నాయకత్వం వహిస్తున్న దీపేష్ వీరా మాట్లాడుతూ... నాణ్యమైన, అందుబాటులో ఉండే వెటర్నరీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు, నివారణ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యమని చెప్పారు. దేశవ్యాప్తంగా 100కు పైగా పెట్‌ఫోక్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ లో పెట్‌ఫోక్ వెటర్నరీ సేవల ప్రారంభం

## హైదరాబాద్‌లో పెట్‌ఫోక్
# వెటర్నరీ సేవల ప్రారంభం




దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెట్ కేర్ బ్రాండ్ ‘పెట్‌ఫోక్’ వెటర్నరీ హెల్త్‌కేర్ సేవల్లోకి అడుగుపెట్టింది. కంపల్లిలోని పెట్‌ఫోక్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌లో త్వరలో వెటర్నరీ కన్సల్టేషన్, టీకాలు, నివారణ ఆరోగ్య సేవలు ప్రారంభం కానుండగా, బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన వెటర్నరీ పాడ్ కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా పెట్‌ఫోక్ వ్యవస్థాపకుడు, సీఈఓ లక్ష్మీకాంత్ పుడుచెర్రి మాట్లాడుతూ, పెంపుడు జంతువులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు వెటర్నరీ విభాగాన్ని ప్రారంభించామని తెలిపారు. వెటర్నరీ విభాగ విస్తరణకు నాయకత్వం వహిస్తున్న దీపేష్ వీరా మాట్లాడుతూ... నాణ్యమైన, అందుబాటులో ఉండే వెటర్నరీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు, నివారణ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యమని చెప్పారు. దేశవ్యాప్తంగా 100కు పైగా పెట్‌ఫోక్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.





## ఫార్చ్యూన్ ఇండియా’ ఎంపీడబ్ల్యూ జాబితాలో నీతా అంబానీకి అగ్రస్థానం




దేశంలో ఆర్థిక, వాణిజ్య రంగాలను సమర్థంగా నడిపిస్తున్న 100 మంది అగ్రశ్రేణి మహిళా లీడర్లను గుర్తించేలా ‘ఫార్చ్యూన్ ఇండియా’ అత్యంత శక్తిమంతమైన మహిళలు (Most Powerful Women-MPW) 2026 జాబితాను విడుదల చేసింది. ఈ సందర్భంగా ముంబయిలో ఓ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ నంబర్ వన్ స్థానంలో నిలిచి తన ప్రత్యేకతను చాటుకోవడంతో పాటు ప్రసంగంతో ఆకట్టుకున్నారు. కరుణ, సమానత్వంతో కూడిన నాయకత్వం వృద్ధి చెందాలని, ఆడపిల్లల అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టడమే దేశ భవిష్యత్తుకు పునాది అన్నారు. వ్యాపార, సాంకేతిక, బ్యాంకింగ్, పబ్లిక్ పాలసీ, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాలకు చెందిన పలువురు ప్రముఖ మహిళా లీడర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ (MPW 2026) అధికారిక జాబితా విడుదల చేసిన అనంతరం భవిష్యత్తు నాయకత్వం, ఏఐ, ఆర్థిక సాధికారత, సమ్మిళిత వృద్ధి, దేశ నిర్మాణం తదితర కీలక అంశాలపై మహిళా లీడర్లు చర్చించారు



# గులాబీమయమైన ఆమనగల్లు



**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆమనగల్లులో బిఆర్ఎస్ కదనభేరి**
**కేసీఆర్ పాలనలో సంక్షేమం రేవంత్ పాలనలో సంక్షోభం**
**అలీబాబా దొంగల ముఠా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు..**
**రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపి.. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తీసుకురావాలి**
**కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,**
**మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా,**

**ఆమనగల్లు, (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు 33 నెలలు పూర్తయిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజవర్గంలోని ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా పిలుపుమేరకు కదనభేరి పూరించారు. నియోజకవర్గంలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల, చారగొండ మండలాల నుండి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆమనగల్లు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి పెద్ద ఎత్తున మహిళలు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తల తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, రజనీ సాయిచంద్, విజితా రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగించిందని ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో పడేయా లని జోస్యం చెప్పారు. ఎన్నికల గ్యారెంటీ కార్డు ప్రకారం ఇవ్వవలసిన కాంగ్రెస్ బాకీ కార్డులను సభలో ప్రదర్శించారు. రైతు భరోసా, వరి పంటకు 500 బోనస్ రైతు కూలీలకు ఉపాధి హామీ నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల బాకీ.. విద్యా భరోసా కార్డు విద్యార్థులకు స్కాలర్షిప్లు, కార్మికులకు మహిళలకు రూ. 2500 పెన్షన్ వృద్ధులు, బీడీ కార్మికులకు పెన్షన్ దివ్యాంగులకు పెన్షన్ పెంపు వంటి హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద తులం బంగారం విద్యార్థులకు స్కూటీ, ఫీజు రియంబర్స్మెంట్ బాకీ పడ్డ



మొత్తం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్లపాటు రాష్ట్రం అనేక రంగాల్లో దేశంలోనే నెంబర్ 1 గా నిలిచిందని గుర్తు చేశారు. నేటి కాం గ్రెస్ పాలనలో రాష్ట్ర సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ వెను కంజలో ఉందన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత విధ్వంసం అరా చకం అక్రమాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ప్రతి లబ్ధిదారుడికి కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని పింఛన్ పెంపు నుంచి అనేక పథకాలకు సంబంధించి రావాల్సిన బాకీ డబ్బులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈనెల 5న కల్వకుర్తిలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు యువకులతో భారీ సమరభేరి పూరించడం జరుగుతుందని జయపాల్ యాదవ్, ఉప్పల వెంకటేష్ గుప్తా తెలిపారు. వెయ్యి రోజులు 33 నెలల పాలనలో దొంగల ముఠా





రాష్ట్రాన్ని దోచుకుందని ఆయన అన్నారు. రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తీసుకురావాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసిలు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు.. విజితా రెడ్డి, జర్పుల దశత్ నాయక్, విజయ్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, అర్జున్ రావు, శంకర్ కంబాలపల్లి పరమేష్, గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, ఆమనగల్ మున్సి పాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రామకృష్ణ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ ఎనుమల్ల రమేష్, మున్సిపాలిటీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నాగిళ్ల జగన్, ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, పుల్లారెడ్డి అనుష శ్రీశైలం, దుడ్డు ఆంజనేయులు, యశోదమ్మ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, రమేష్ నాయక్, జోతయ్య, శ్రీనివాస్ యాదవ్, కుమార్, సైదులు గౌడ్, చుక్క నిరంజన్ గౌడ్, రాజు, సయ్యద్ ఖలీల్, భాస్కర్, కవిత, మంచుకొండ జగదీష్, ఆచారీ, కిషోర్, వి సాయిలు, జహంగీర్, సతీష్, సురేష్, కోట శ్రీను, రంజిత్, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి అంటేనే మోసం జూట

**తొగుట ధర్నాలో మహిళ సంచలన వ్యాఖ్యలు ఆటో దిగి**
**బీఆర్ఎస్ ఆందోళనకు మద్దతు**




**తొగుట, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో వైఫల్యం చెందిందంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తొగుటలో చేపట్టిన ఆందోళనకు అనూహ్య మద్దతు లభించింది. సిద్దిపేటకు ఆటోలో వెళ్తున్న ఓ మహిళ తొగుటలో జరుగుతున్న ధర్నాను చూసి ఆటోను ఆపించి, అక్కడి నుంచి దిగి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అంటేనే మోసం. జూట. ఎన్నికల ముందు ఎన్నో మాయమాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదు అంటూ ఆమె మండిపడ్డారు. పింఛన్ల పెంపు ఏమైందని, కొత్త పింఛన్లు ఎందుకు మంజూరు కావడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో పేదలకు ఎంతో మేలు జరిగింది. ఇప్పుడు పరిస్థితులు మారి పోయాయి. మళ్లీ కేసీఆర్ వస్తేనే ప్రజలకు న్యాయం జరుగు తుంది అని ఆమె పేర్కొన్నారు. ఆటోలో వెళ్తూ ధర్నా వద్ద ఆగి స్వచ్ఛందంగా నిరసనలో పాల్గొన్న మహిళ వ్యాఖ్యలు అక్కడున్న వారిని ఆకట్టుకున్నా యి. ఆమె మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



**ఆమనగల్లు, (సింగిడి):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్ జనసేన నాయకులు మరియు అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించా రు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బికుమాండ్ల నర్సింహా, జనసేన నాయకులు అంకం సత్యం, ప్రభు శంకర్, అభిమానులు : రఫీక్, సాయి , సోమ్లా నాయక్, చందు నాయక్, శివ, గోపాల్ , బద్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు



**బల్మూరు, (సింగిడి):** బల్మూర్ మండల కేంద్రంలో దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమా న్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లమల్ల రాంప్రసాద్ గౌడ్, డీసీసీ కార్యదర్శి కదీర్, డీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటయ్య, డీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి, మండల ఉపాధ్యక్షులు మషాన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలపై ప్రజా పోరాటం



**బల్మూరు, (సింగిడి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బల్మూరులో ర్యాలీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ బల్మూరు మండల యూత్ ప్రెసిడెంట్ సుల్తాన్ తెలిపారు. కార్య క్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనపై సంబరాలు



**అల్వాల్, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి 1000 రోజుల ప్రజా పాలన లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు పాలన చేపట్టామని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం 194 డివిజన్ మల్లెల శివ ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కేబుల్ శేఖర్, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, మంద బాలకృష్ణ రెడ్డి, భాస్కర్, బి ఎన్ రమేష్, సుదర్శన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రాజన్, సత్యం, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ముత్యంరెడ్డి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

**తొగుట మండలంలో ముత్యం రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన**
**చెరుకు శ్రీనివాస్ రెడ్డి చెరుకు విజయలక్ష్మి ..**
**రాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ**



**తొగుట (సింగిడి):** స్వర్గీయ మాజీ మంత్రి, ప్రజా నాయకులు చెరుకు ముత్యం రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా తొగుట మండలంలోని పలు గ్రామాల్లో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి , ముత్యం రెడ్డి సతీమణి చెరుకు విజయలక్ష్మి తో కలిసి పాల్గొని ముత్యం రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తొగుట మండలంలోని తుక్కాపూర్ లోని ముత్యం రెడ్డి స్మృతివనం లో ఏర్పాటు చేసిన స్వర్గీయ చెరుకు ముత్యం రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆయన చేసిన ప్రజాసే వను స్మరించుకున్నారు. ప్రజల కోసం జీవితాం తం పనిచేసిన గొప్ప నాయకుడిగా ముత్యం రెడ్డి కి ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అనంతరం రాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, తమ తల్లిదండ్రులు, గ్రామం, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.



విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో, వారి విద్యాభి వృద్ధికి సహక రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి తమ లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవా లని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి సమా జానికి నాయకత్వం వహించాల్సి ఉంటుందని, అందుకే విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. అనంతరం వాగ్గడ్డ వద్ద ఉన్న స్వర్గీయ చెరుకు ముత్యం రెడ్డి విగ్రహానికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ము త్యం రెడ్డి ప్రజాసేవను, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముత్యం రెడ్డి పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం ప్రజల మధ్య ఉండేవారని తెలిపారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభి వృద్ధి, విద్య, సాగునీరు, రహదారులు, ప్రజా సం క్షేమం వంటి అనేక అంశాలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ముత్యం రెడ్డి మన మధ్య లేకపోయినా. ఆయన చేసిన ప్రజాసేవ, ఆయన చూపిన మార్గం, ఆయన ఆశయాలు ఎప్పటికీ మనకు స్ఫూర్తిని స్తాయి. ప్రజల కోసం పనిచేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డి,మండల అధ్యక్షులు పంది రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అయిలపూరం కనకయ్య యాదవ్, వివిధ మండలాల అధ్య క్షులు, మార్కెట్ చైర్మన్లు, సర్పంచ్ లు, ఉపసర్పం చ్ లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## సింగరేణి కార్మికులకు బిగ్ రిలీఫ్

**పెరిక్స్ పై ఇన్‌కమ్ టాక్స్ రద్దుకు యాజమాన్యం గ్రీన్ సిగ్నల్..**
**21 డిమాండ్ల ఆమోదమే ఏఐటియుసి పోరాట విజయం: కొరిమి రాజకుమార్**




**భూపాలపల్లి, (సింగిడి):** సింగరే ణి కార్మికులకు పెరిక్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దుకు యాజమాన్యం అంగీకరించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. కెటికె ఓసి 3 (యూ జి) గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కెటికె ఓసి యూ జి గనిలో పిట్ సెక్రటరీ ఎల్. శంకర్ అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జనరల్ సెక్రె టరీ కొరిమి రాజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ ఎల్ సి మీటింగ్లో ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలను 21 డిమాండ్లను యాజ మాన్యం అంగీకరిం చిందని తెలిపారు. ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న కార్మికుల సొం తింటి కల త్వరలోనే నెరవేరబోతుందని యాజ మాన్యం సొంతింటి పథకం అమలుకు ఒప్పం దం జరిగిందని పేర్కొన్నారు. కార్మికులు సొంత ఇల్లు నిర్మించుకోవడానికి సంబంధించిన అంశంపై అధ్యయనం చేసి, మరి కొన్ని నెలల్లో నివేదిక సమర్పించేలా అధ్యయన కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీకరించారన్నారు. అలాగే 2016--17 జె ఎం ఈ టి లకు ఓవర్ మాన్ ప్రమోషన్లు కల్పిం చేందుకు అంగీకరిం చారన్నారు. ముఖ్యంగా కార్మికులు ఎదుర్కొంటున్న మారు పేర్ల సమస్యను పరిష్కరించేందుకు అంగీకరించా రని తెలిపారు.

**ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా:** కార్మికుల సహజ మరణం సంభవించిన సందర్భాల్లో కార్మికుల కుటుంబాలకు బ్యాంకు, కంపెనీ ద్వారా మొత్తంగా రూ 20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే విధంగా ఒప్పందం చేసుకున్నారని వివరించారు.

**149 మంది డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్**

పెండింగ్ లో ఉన్న149 మంది డిపెండెంట్లకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడం కోసం చర్చిం చడం జరిగిందన్నారు. కార్మికుల రక్షణకు సంబంధించిన పరికరములు ఇతర పని ముట్లు త్వరితగతిన అందించడానికి ఒప్పందం చేసు కున్నారని అన్నారు. మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, సూపర్వైజర్, మెడికల్ బోర్డు ఇట్లా అనేక సమస్యలపై యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. కార్మికుల పక్షాన నిత్యం నిరంతరం పోరాటాలు చేసేది ఏఐటీయూసీ గుర్తింపు సం ఘం మాత్రమేనని అన్నారు. ఇతర సంఘాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని రాబో యే రోజుల్లో యూనియన్ కు అండగా కార్మి కులు నిలవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, బ్రాంచ్ కమిటీ నాయ కులు నూకల చంద్రమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగత్ రావు, ఓసి-3 పిట్ సెక్రటరీ కృష్ణా రెడ్డి, బ్రాంచి నాయకులు లింగయ్య, సోమిరెడ్డి, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి,హరీష్, తదితరులు సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా



**అమరచింత, (సింగిడి):** పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి హామీ, ప్రభుత్వ బడుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎస్. రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎస్ గోపి మాట్లాడుతూ 2008లో సీపీఎం పోరాట ఫలితంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించామని, వాటికి హద్దులు చూపించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ పెన్షన్లు ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, గృహిణులకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీలను అమలు చేయాలని, ఉపాధి హామీ పెండింగ్ కూలీ డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ షేక్ చాంద్ పాషాకు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుచ్చన్న, రవి, భారతీయుడు, కృపధానం, రత్నం, దావీదు, మునెప్ప, కురుమూర్తి, నారాయణ, సత్యమ్మ, రాములు, రంగన్న, రాములు, వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమనగల్లు డివిజన్లో డిజిటల్ క్రాప్ సర్వే.. రైతులు సహకరించాలి

**ఆమనగల్లు, (సింగిడి):** అమనగల్లు డివిజన్ పరిధిలో 2026 ఖరీఫ్ సీజన్కు సంబంధించి డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అమనగల్లు , తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండలాల్లో ఈ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, పెట్టుబడి సహాయం అందించేందుకు ఈ సర్వే కీలకమని అధికారులు తెలిపారు. పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బందికి రైతులు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు. సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్వేకు చివరి తేదీ సెప్టెంబర్ 30, 2026 అని అధికారులు స్పష్టం చేశారు.

**ప్రణాళికాబద్ధంగా మున్సిపాలిటీ**

## అభివృద్ధి: పత్య నాయక్

**కోటి రూపాయలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం**



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపా లిటీని ప్రణాళికబద్ధంగా అని రంగాల్లో అభివృద్ధి పరచాలని మున్సిపాలిటీ పాలకవర్గానికి మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ సూచించారు. బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ 11వ వార్డులో సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ సునీత ప్రశాంత్, కో అప్షన్ సభ్యులు హాలిమ బేగం, ఖాదర్ లతో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి తమ హాయంలోనే జరుగుతుందని, వార్డులలో జరుగుతున్న సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణము నిదర్శనమని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.. అమనగల్లు మున్సిపాలిటిని అన్ని రంగాల్లో సర్వసుందరంగా తీర్చిదిద్ది మరింత అభివృద్ధి చేస్తామని చైర్మన్ పత్యా నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ మండ్లి రాములు,స్థానిక నాయకులు కరీం,పెద్దయ్య,ఆనంద్,తదితరులు ఉన్నారు

## ఎరువుల కోసం రైతులు కొత్త యాప్ ను వినియోగించుకోవాలి



**కమలాపూర్, (సింగిడి):** ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినటువంటి, ఎఫ్ ఎఫ్ ఎస్ ఖ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలై జర్స్ సేల్స్‌రి ఆప్ నుంచి పూర్తిస్థా యిలో నేటినుండి అందుబాటు లోకి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి బి వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి రైతులు డౌన్లోడ్ చేసుకుని వినిగించుకోవాలని కోరారు. దీని ద్వారా యూరియా, డిఏపి, ఎంఓపి, ఎస్ఎస్పి వంటి కాంప్లెక్స్ఎరువులు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ విధానం వల్ల ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరిగి, బ్లాక్ మార్కెటింగ్ కు పూర్తిగా అరికట్టవ చ్చునని మండల వ్యవసాయ తెలిపారు. రైతులకు యాప్ గురించి సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలనిఅన్నారు. ఇప్పటి నుండి ఈ యాప్ ద్వారా మాత్రమే ఫర్టిలైజర్స్ ఇవ్వబడతాయని తెలిపారు.

## ఘనంగా మాజీ ఎంబీసీ చైర్మన్ జన్మదిన వేడుకలు



**అల్వాల్, (సింగిడి):** మాజీ ఎంబీసీ చైర్మన్ నంది కంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు నిడమలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వెంకటాపురం చౌరస్తా పి జేఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధోలి రమేష్, సూర్య ప్రకాష్ రెడ్డి, మార్షల్, రాజు పవన్, రేవంత్ రెడ్డి, సురేష్, మహిళా కార్యకర్తలు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




**కమలాపూర్, (సింగిడి):** పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను బుధవారం పవన్ కళ్యాణ్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు,పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన జియావొద్దీన్ అనే పవన్ కళ్యాణ్ వీరభిమాని రోడ్ ప్రమాదంలో కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ కార్యకర్తలు నిధులు సమీకరించి మృతుడి ఇద్దరి కుమార్తెలకు పది వేల రూపాయల చొప్పున ఫిక్స్ డిపాజిట్ చేసి రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా శివారెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు బాండ్లను అందజేశారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ లో ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోవడం చాలా బాధాకర మన్నారు. ప్రతి కార్యకర్తకు 5లక్షల రూపాయలు గల భీమా పాలసీ తీసుకువచ్చిన ఘనత కేవలం పవన్ కళ్యాణ్ గారిదేనని తెలిపారు. జియావోద్దీన్ కుటుంబానికి కూడా త్వరలో భీమా అందిస్తామని అన్నారు. ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నారాయణ గౌడ్,మహేష్, శ్రీనివాస్, మహేష్,శివాజీ, సిద్దు,శివ కుమార్,తిరుపతి,రాజమౌళి, రమేష్, పవన్, రాజేందర్, అజయ్,తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
3-9-2026

## అమరచింతలో రూ.9.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**అమరచింత,(సింగిడి):** వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీలో రూ. 9.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్ కుమార్ శ్రీకారం చుట్టారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చైర్పర్సన్ అన్నారు. ఇందులో సీసీ రోడ్లకు రూ. 7 కోట్లు, డ్రైనేజీ కాలువలకు రూ. 2.50 కోట్లు కేటాయించారు. మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. తొలివిడతగా బీసీ కాలనీలో పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి రోడ్లు లేక, డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్న తమకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. అమరచింత పట్టణవాసి నాగరాజు గౌడ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవికాంత్, జిల్లా కార్యదర్శి తెలుగు రమేష్, మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## చంద్రనాయక్ తాండలో మినుము విత్తనాల పంపిణీ



**అమరచింత, (సింగిడి)** వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో అమరచింత మండలంలోని చంద్రనాయక్ తాండలో మిషన్ ఆత్మ నిర్భరత – పప్పు దినుసుల కార్యక్రమం కింద రైతులకు బుధవారం మినుము విత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచ్ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి పాల్గొన్నారు. కెవికె మదనపురం సెంటర్ నుండి డాక్టర్ భవాని పప్పు దినుసుల పంటల ఉపయో గాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, మిర్చి, చెరకు, పత్తి, వరి పంటల్లో సాగు యాజమాన్య పద్ధ తుల గురించి



రైతులకు వివరించారు. ఆత్మ ప్రోగ్రాం కింద నానో యూరియా, నానో డీఏపీ, నానో పొటా ష్ ను పంట లపై పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు.

## ప్రభుత్వ వైద్య సేవలపై... ప్రజల్లో విశ్వాసం పెంపొందించడమే లక్ష్యం.

### ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం.

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్




**మేడ్చల్ కలెక్టరేట్, (సింగిడి)** ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అందుతుందనే భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శిం చారు. సాధారణ తనిఖీలకు భిన్నంగా, డా. కె. ఆనంద్ అధికారి హోదాను పక్కనపెట్టి స్వయంగా వైద్యుడిగా రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రోగితో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకుని, అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు తగిన మందులను సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం పెంచేందుకు ఈ చర్య ఒక ప్రత్యేక సందేశాన్ని అందించింది. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రోగుల రిజిస్టర్లు, వైద్య రికార్డులు, మందుల నిల్వలు, సేవల నిర్వహణ తదితర అంశాలను డా. కె. ఆనంద్ స్వయంగా పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి రోజువారీగా అందుతున్న సేవలను సమీక్షించారు. రికార్డుల నిర్వహణతో పాటు ప్రతి రోగికి సమయానికి, గౌరవంగా, నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

## ప్రశ్నిస్తున్నా.. పట్టించుకోరా?

### – రోడ్డు వేసిన మరుసటి రోజే పగుళ్లు.. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారా?

### – నాసిరకం సిమెంట్ రోడ్డుపై బీఆర్ఎస్ నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ (ఢిల్లీ రాజు) ఆగ్రహం





**మల్హర్, (సింగిడి)** అన్‌సాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు నాసిరకంగా ఉందని సామాజిక మాధ్యమాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంపై బీఆర్ఎస్ నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ (ఢిల్లీ రాజు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, రోడ్డు వేసిన మరుసటి రోజుకే పగుళ్లు రావడం పనుల నాణ్యతకు అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు నాణ్యతను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు సమస్యను ప్రశ్నిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కావాల్సిందేనా? ఇదేనా ప్రజాపాలన? అని ప్రశ్నించారు. నాసిరకం పనులతో కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారా అంటూ ఆయన మండిపడ్డారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై సమగ్రంగా విచారణ జరిపి, నాసిరకం పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బానోత్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## దుబ్బాక మున్సిపాలిటీలో చెరువుల అభివృద్ధి, పారిశుధ్యంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమీక్ష

**దుబ్బాక,(సింగిడి):** మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు వివిధ అభివృద్ధి పనులపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ ఈఈ, డీఈ, ఏఈలు, సంబంధిత కాంట్రాక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న చెరువుల అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులను



పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**వర్షాకాలంలో ప్రత్యేక నిఘా**

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో చెరువులు, కాలువలు, డ్రైనేజీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. చెరువుల కట్టలు, పరిసర ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి**

మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇతర అభి వృద్ధి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి ప్రజ లకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

## విద్యే పేదరికాన్ని జయించే విలువైన ఆయుధం

### అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఐ తౌడ సత్యనారాయణ

**దుబ్బాక, (సింగిడి)** పేదరికం లక్ష్య సాధనకు ఎప్పటికీ అడ్డంకి కాకూడదని, పేదరికాన్ని జయించి ఉన్నత స్థాయికి ఎదగడా నికి విద్యే అత్యంత విలువైన ఆయుధమని అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడ సత్యనారాయణ అన్నారు. దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను సత్యనారాయణ అందజేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సామగ్రిని అందించి, వారిని ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం, అవసరమైన సహకారం అందిస్తే తమ ప్రతిభను మరింతగా వెలికితీసుకుని ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు. ఆర్థిక



ఇబ్బందులు విద్యార్థుల చదువుకు ఆటంకం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

**కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలి**

విద్యార్థులు పేదరికాన్ని చూసి నిరాశ చెందకుండా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్యనారాయణ సూచించారు. క్రమశిక్షణ, సహనం, పట్టుదల, నిరంతర కృషి జీవితంలో విజయాన్ని సాధించేందుకు ముఖ్యమైన మెట్లని పేర్కొన్నారు. ఎక్కడ చదువుతున్నామన్నది కాదని, ఎంత శ్రద్ధగా



చదువుతున్నాం, లక్ష్య సాధన కోసం ఎంత కష్టపడుతున్నామన్నదే ముఖ్యమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తు పెట్టుకుని విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సత్యనారాయణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమురె నరేష్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు వనం పోచయ్య, డి. చంద్రయ్య, వెంకట్ స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.. :ఎమ్మెల్యే కశిరెడ్డి





**ఆమనగల్లు, (సింగిడి)** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కడ్తాల మండల కేంద్రంలో రచ్చబండ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కల్వకుర్తి శాసన సభ్యులు కశిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు. రైతులు, మహిళలు, పేదలు, యువత, విద్యార్థులు, కార్మికులు తదితర వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. ప్రజల అవసరాలకు అనుగుణం గా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, కొనసాగుతున్న పనులు, పూర్తయిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించచి, ప్రధానంగా బీటీ రహదారులు, అంతర్గత రహదారులు, బ్రిడ్జిలు, డ్రైనేజీ, తాగునీటి వసతులు, విద్యుత్, విద్య, వైద్యం, ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర రంగాల్లో చేపట్టిన పనుల గురించి వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్నర్ మీటింగ్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వ యం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్య లను వినడం, వాటికి పరిష్కారం చూపడం, అభివృద్ధి పనులను ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజ కవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజ లకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేం దుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఇది 1000 రోజుల ప్రజా పాలన కాదు..

## వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడన!

### -- మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం,(సింగిడి)** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వారం రోజుల పాటు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) గారు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన



మోసాలను, ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టారు.

అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కారణంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించి, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గం మరియు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ పార్టీలో చేరికలు

### మంత్రి జూపల్లి సొంత ఊరిలో

### బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

**చిన్నంబావి,(సింగిడి)** చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డ్నెంబర్ జ్ఞానేశ్వరి కర్ణాకర్ మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు కర్ణాకర్‌లతోపాటు పురేందర్ గౌడ్, జంపుల రమేష్, వేముల వెంకటేష్ గౌడ్, ముని ఈశ్వర్, శివశంకర్, సహదేవుడు బుధవారం కాంగ్రెస్ పార్టీని వీడారు. కొల్లాపూర్ మాజీఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పిబీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ ఈ సందర్భంగా కర్ణాకర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనుకాంగ్రెస్ నాయకులు నెరవేర్చకపోవడం వల్లే తాము బీఆర్ఎస్‌లో చేరాల్సివ చ్చిందని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో ప్రభుత్వంవిఫలమైందని ఆయన విమర్శిం చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడు తూ.. స్థానికమంత్రి సొంత గ్రామంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతఉందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, గతబీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందనిచెప్పారు. ఈ కార్యక్ర మంలో చిన్నంబావి మండల బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరునవ్వుల రాజకీయం... ప్రజా సంక్షేమమే ఆయన శకం.

### యువ నాయకుడు అబ్బాగోని రాజ్‌కుమార్ గౌడ్



**జవహర్ నగర్,(సింగిడి)** చిరునవ్వుల రాజకీయం... ప్రజా సంక్షేమమే ఆయన శకం... దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కీసర సర్కిల్ జవహర్‌నగర్‌లో వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ యువ సీనియర్ నాయకులు అబ్బాగోని రాజ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు తరలివచ్చి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.? ఈ సందర్భంగా యువ నేత అబ్బాగోని రాజ్‌కుమార్ గౌడ్ మాట్లా డుతూ వైఎస్సార్ కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదు, ప్రతి పేదవాడి గుండెచప్పుడు. రైతన్నలకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మక పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహా నేత ఆయన అని కొనియాడారు.?సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మన అందరి కర్తవ్యమని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువతరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై పోరా డుతున్న అబ్బాగోని రాజ్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యువ నాయకులు పోలాస కిరణ్ కుమార్, జడల బాలకృష్ణ, అందె సురేష్, నిఖిల్, నాగరాజు గౌడ్, పలువురు ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

## కొడంగల్ నుండి హైదరాబాద్‌కు ఎలక్ట్రికల్ బస్సు

### –ప్రారంభించిన మున్సిపల్ ఛైర్మన్, కడ అధికారి




**కొడంగల్, (సింగిడి)** టిజి ఆర్టీసీ సంస్థ ద్వారా కొడంగల్ నుంచి హైదరాబాద్ కు ఎలక్ట్రానిక్ ఎక్స్ ప్రెస్ బస్సు ను బుధవారం కొడంగల్ లో ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్, కడ అధికారి వెంకట్ రెడ్డి లు జెండా ఊపి బస్సు ను ప్రారంభించారు. పెట్రోల్ డీజిల్ ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయనీ, పెట్రోల్ డీజిల్ ఖర్చులను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఎలక్ట్రానిక్ బస్సు లను ప్రారంభిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈబస్సులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మెగావత్ శంకర్ నాయక్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మల్లికార్జున నగర్‌లో

## సభను విజయవంతం చేయండి

### మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



**మల్కాజిగిరి,(సింగిడి)** 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న నివాసితులు, ఎండోమెంట్ భూములలో నివాసముంటున్న నివాసి తులు, యుఎల్‌సిలో ఉన్న నివాసితులు ప్రభుత్వ భూములలో వివాసముం టున్న నివాసితులు నేడు (3న) గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్ లో జరిగే కార్యక్రమానికి స్థానిక ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని సభను విజయవంతం చేయాలనీ గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొంటారని, గురువారం 11 గంటలకు మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్ లో జరిగే కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు.

## పేదల పెన్నిధి... బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్సార్

### ఆరోగ్యశ్రీ ప్రధాత... ఇందిరమ్మ గృహ నిర్మాణ విధాత : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్



**జవహర్ నగర్, (సింగిడి)** ఎదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డియే అని ఆరోగ్యశ్రీ ప్రధాత... ఇందిరమ్మ గృహ నిర్మాణ విధాత రాజశేఖర్ రెడ్డియే అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోట కూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ లో గల వైయస్సార్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమా నికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై



మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రైతులకు ఉచిత కరెంటును, వైద్య సేవలో భాగంగా 108 అంబులెన్స్ ను ఫీజు రియం బర్స్మెంట్, ఇందిరమ్మ ఇండ్లతో పాటు పేద ప్రజలందరికీ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. రాజశేఖర్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు ఆలోచ నలు అతను ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. సేవే దైవంగా ప్రేమే ధ్యేయంగా పేదవారికి ఆపన్న హస్తం అందించి వారి బాగోగులు పేదవారి



సంక్షేమానికి నిరంతరం శ్రమించిన నాయకుడు దివంగత రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్,



జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానంద్,

# దళిత జర్నలిస్టులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలి , ఇళ్ల స్థలాలు కేటాయించాలి**
**ఉచిత బస్‌పాస్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి**
**దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపగు జాన్ డిమాండ్**




**సంగారెడ్డి ప్రతినిధి (సింగిడి):** దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాశాపగు జాన్ డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ జర్నలిజం వృత్తిని కొనసాగిస్తున్నారని తెలి పారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఇళ్ల స్థలాలు లేని దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల వృత్తి స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలిదళిత జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కాప్పరాగు జాన్ కోరారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందే విధంగా ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని సూచించారు. దళిత జర్నలిస్టుల సమస్య లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సంఘం ప్రతినిధులతో చర్చించాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులను గుర్తించి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం దళిత జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చే హామీలను అమలు చేయడంతో పాటు, దళిత జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దళిత జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని కాశప్పగు జాన్ తెలిపారు. కార్య క్రమంలో జిల్లాలోని దళిత జర్నలిస్ట్ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయ్ రాజు, జిల్లా అధ్యక్షులు రామని అశోక్న, నవీన్, రాజేందర్, విల్సన్, డి అశోక్, తదితరా జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయొద్దని
# సీపీ సుమతి ఐపీఎస్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి



**మల్కాజిగిరి, (సింగిడి):** బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయకుండా చూడాలని బుధవారం మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ సుమతి ఐపీఎస్ ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు నమోదు చేయకుండా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలని, అలాగే ఇప్పటికే నమోదైన కేసుల విషయంలో కూడా వాస్తవాలను పరిశీలించి, చట్టపరమైన నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి పై సీపీ సుమతి ఐపీఎస్ సానుకూలంగా స్పందించి, విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, హేమంత్ పటేల్, గౌస్ ఇమ్రాన్, బంటి, మాశెట్టి అనిల్, నర్సింగ్ రావు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై మండిపడ్డ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల నిరంకుశ పాలనలో ఇచ్చిన మోసపూరిత హామీలు నెరవేర్చడంలో విఫలమైందని నిరసిస్తూ, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు నిరసన గళం విప్పాయి. బుధవారం మర్రిచెట్టు వద్ద మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లలో పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సమక్షంలో పార్టీ నాయకులు 'ఛార్జ్‌షీట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. స్థానికంగా ఎదురవుతున్న పలు కీలక సమస్యలను ఈ ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచి, తక్షణమే వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పుప్పలగూడ అంబేద్కర్ భవనం, శ్మశానవాటిక రహదారి పనులు, బుల్కాపూర్ నాలా పూడికతీత, క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలి. పెంచిన ఆస్తిపన్నును రద్దు చేసి, పాత పద్ధతినే కొనసాగించాలి. భూగర్భ మురుగునీటి పారుదల పైప్‌లైన్ నిర్మాణానికి అయిన ఖర్చుల పద్దులను ప్రజల ముందు ఉంచాలి. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగేలా రహదారులను విస్తరించాలని, దారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను ప్రక్కకు జరపాలని డిమాండ్ చేశారు. నెమలి నగర్ వాసులకు వెంటనే ఇంటి నంబర్లు కేటాయించాలి. చిత్రపురి కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలాల దస్తావేజుల వివరాలను బహిర్గతం చేయడంతో పాటు, అలకపూర్ టౌన్‌షిప్‌లో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను వేగవం తం చేయాలి. నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం వినియోగంపై స్పష్టతనివ్వాలని, స్థానిక సమస్యలను వెంటనే తీర్చకపోతే ప్రజల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం




**మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజిగిరి, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతునప్పటికి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన, అనేక హామీలను అమలు చేయకుండా ఘోరంగా విఫలమవడమే కాకుండా, అన్ని వర్గాలను మోసం చేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో భారీ ధర్నా కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు, గ్యారంటీల పేరుతో ప్రజలకు ఇవ్వాల్సిన అనేక ప్రయోజనాలు ఇప్పటికీ బకాయిగానే ఉన్నాయని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం హామీ, మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన సంక్షేమ పథకాలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, ఆటో కార్మికులకు సంక్షేమం, రైతులకు రైతు భరోసా వంటి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ పడిందని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగాలు, రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత, అనిల్ కిషోర్ గౌడ్, శిరీష జితేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశు రాం రెడ్డి, రావుల అంజయ్య, జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అమినుద్దీన్, ప్రభాకర్ గౌడ్, చిన్న యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, చిందం శ్రీనివాస్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శ్రీధర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, సురేష్, చంద్ర మౌళి, భాగ్య నందరావు, నర్సింగరావు, రేగటి శివకుమార్ గౌడ్, జె కె సాయి గౌడ్, సుమన్ గౌడ్, ఫరీద్, చందు, హేమంత్ పటేల్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, జి రాజు, శివసాయి యాదవ్, మాశెట్టి అనిల్, కిరణ్, అల్లి శ్రీనివాస్, కిట్టు, మల్లేష్ యాదవ్, బిక్షపతి, విజయ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, మహేష్, రేవంత్ రెడ్డి, పవన్, ప్రశాంత్ రెడ్డి, శరణ్‌గిరి, సందీప్, అరవింద్, అరుణ్, శోభ, ఉష, శిల్ప, అరుంధతి, జ్యోతి, లావణ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ వ్యక్తిగత విచారణలు ప్రారంభం..
# ప్రజలు అసలు పత్రాలతో హాజరుకావాలి




**జడ్చర్ల, (సింగిడి):** ప్రత్యేక సారాంశ ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బడే పల్లి మున్సిపల్ కార్యాలయంలోని మూడు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన నోటీసులపై వ్యక్తిగత విచారణలను మంగళవారం ప్రారంభించారు. విచారణ ప్రారంభ సమయంలో కుర్చీలు, మైక్ తదితర ఏర్పాట్లలో కొంత ఆలస్యం జరగడంతో ప్రజలకు స్వల్ప అసౌకర్యం కలిగింది. దీనిపై మున్సిపల్ అధికారులు ప్రజలకు క్షమాపణలు తెలిపారు. అనంతరం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విచారణ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లేని కేసులు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న కేసులకు సంబంధించిన వ్యక్తిగత విచారణ విధానంపై కార్యాచరణ శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బూత్ స్థాయి అధికారులు విచారణ ప్రక్రియపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం నుంచి పలువురు ఓటర్లకు సంబంధించిన వ్యక్తిగత విచారణలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రజలు విచారణకు హాజరయ్యే సమయంలో సంబంధిత అసలు పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. సమర్పించిన అసలు పత్రాల చిత్రాలను బూత్ స్థాయి అధికారులు తమ మొబైల్ అనువర్తనంలో స్పష్టంగా నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మ్యాపింగ్ లేని కేసులకు సంబంధించిన వ్యక్తులు తమకు నిర్ణయించిన తేదీన బడే పల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే వ్యక్తిగత విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న కేసులకు సంబంధించిన వారు నిర్ణయించిన చివరి తేదీలోపు అవసరమైన పత్రాలను తమ బూత్ స్థాయి అధికారి వద్ద సమర్పించవచ్చని తెలిపారు. అవసరమైన పత్రాలను బూత్ స్థాయి అధికారి అనువర్తనంలో స్పష్టంగా నమోదు చేసిన అనంతరమే హాజరు నమోదు చేయబడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తమకు కేటాయించిన తేదీ, సమయానికి విచా రణకు హాజరై అవసరమైన అసలు పత్రాలను వెంట తీసుకువచ్చి అధికారులకు సహకరించా లని ఏఈఆర్‌వో, మున్సిపల్ కమిషనర్ బడేపల్లి మున్సిపాలిటీ కోరారు. ఎస్ఐఆర్ వ్యక్తిగత విచారణ ప్రక్రియను పారదర్శ కంగా, సజావుగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేం దుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వట్టినాగులపల్లిలో అక్రమంగా వ్యర్థాలను
# తరలిస్తున్న వాహనాలపై 45 వేల జరిమానా



**రాజేంద్రనగర్, (సింగిడి):** నార్సింగి సర్కిల్ గండిపేట్ డివిజన్ వట్టి నాగులపల్లి లో భవన నిర్మాణాల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను మంగళవారం రాత్రి నార్సింగ్ సర్కిల్ కార్పొరేషన్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టి వ్యర్థాలను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, టిప్పర్ వాహనాలను పట్టుకొని మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొని వాహనదారులపై 45 వేల రూపాయలను జరిమానా విధించారు. ఈ సందర్భంగా అక్రమంగా వ్యర్థాలను తరలించడం, అనధికార ప్రదేశాల్లో డంపింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి శానిటరీ ఇన్స్పెక్టర్ లచ్చిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయాలపై దాడులను ఖండిస్తూ నిరసన



**జడ్చర్ల, (సింగిడి):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేపీ కార్యాలయాలపై జరిగిన దాడులను ఖండిస్తూ బీజేపీ జడ్చర్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ కార్యాలయాలపై దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి బీజేపీ జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్‌నాథ్ గౌడ్, జడ్చర్ల మండల అధ్యక్షుడు రామకృష్ణ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంబీ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ సీతారాం జోహార్, పట్టణ ప్రధాన కార్యదర్శులు వెంకట్, మల్లేష్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాముల నాగరాజు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ పొలముని నర్సింహులు, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనాథ్, యువ మోర్చా జిల్లా నాయకుడు బత్తుల మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు రమేష్, జి. గుండప్ప, గణేష్, సర్పంచ్ శేఖర్, బుక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్, శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్, సక్కని మల్లేష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, ఓబీసీ మండల అధ్యక్షుడు శివకుమార్ యాదవ్‌తో పాటు కృష్ణ, శేఖర్, శేఖర్ రెడ్డి, విశ్వనాథ్, రవితేజ, శివశంకర్ రెడ్డి, ధనుంజయ్, జీవన్, రాధాకృష్ణ, శివ యాదవ్, సాయికుమార్, రాజు యాదవ్, చరణ్, విష్ణువర్ధన్, శివ ముదిరాజ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. దాడులకు బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలాంటి బెదిరింపులకు, దాడులకు భయపడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడుతారని నాయకులు స్పష్టం చేశారు.

# సైబర్ జాగృకత దివాస్‌లో భాగంగా
# జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన

**డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలపై అవగాహన తప్పనిసరి**
**సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండండి.. ఎస్పీ పరితోష్ పంకజ్**





**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి):** సెప్టెంబర్ మొదటి మొదటి బుధవారం – సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకెట్ హాల్ నందు సైబర్ నేరాల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.., సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి. వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివాస్ పేరుతో సైబర్ అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలి పారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండా లన్నారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు--డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది అన్నారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి, పిన్, సివివి, పాస్‌వర్డ్‌లు వంటి రహస్య సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని అన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు ఇవ్వవద్దని, డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో సరైన వ్యక్తి/ఖాతాకే నగదు వెళు తుందో నిర్ధారించుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు చూపిస్తూ నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా ఎంతో కీలకం. చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారితీయవచ్చు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి అని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డి4సి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, సదాశివ పేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేట పట్టణానికి చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను
# ఇంటింటికి తీసుకెళ్లాలి

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



**మల్కాజిగిరి, (సింగిడి):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకు వచ్చిందని, ఆ పథకాలను ఇంటి ఇంటికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించారు. మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల ప్రజా పాలన సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తా లో బుధవారం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధు లుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అబ్జర్వర్ సమీర్ కౌశల్, లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్,ఎస్ ఆర్ ప్రసాద్, జి ఎన్ వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎ కె మురిగేష్, డివిజన్స్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, పోతుల వినోద్ యాదవ్, నూరి సత్యమూర్తి, పిట్టల నాగరాజు, యూ సుఫ్ భాయ్, ప్రవీణ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, రామచందర్, బాబు, సత్యనారాయణ, పార్ధసారధి,శ్రీ రామ్ యాదవ్, చెన్నారెడ్డి, గ్యార ప్రవీణ్, ఆశా, శారద, భూదేవి, ఇంద్ర, సుమలత యాదవ్, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఫరూక్, సురేష్ సింగ్, బ్రహ్మయ్య, రామక్రిష్ణ, రాము లక్ష్మణ్, వెంకన్న, సిరిగిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ మహిళలకు ఆర్థికంగా ఊరట

**95 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' పథకం కింద రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్ ఆధ్వర్యంలో, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ?రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మొత్తం 95 మందికి చెక్కులు మంజూరయ్యాయి. ప్రతి మైనార్టీ మహిళా లబ్ధిదారుకు రూ. 50,000 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పొంది, తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో మీజ పట్నం మహేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లోని నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మైనార్టీ మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నుంచి రక్షణకు విద్యార్థుల్లో అవగాహన అవసరం: ఎస్పీ జానకి




**జడ్చర్ల, (సింగిడి):** సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించేందుకు అవగాహన, అప్రమ త్తత అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ అన్నారు. డిజిటల్ చెల్లింపులు నిర్వహించే సమయంలో జాగ్రత్తగా ఉండడం ద్వారా సైబర్ మో సాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, పెట్టుబడులు, సామాజిక మాధ్యమాల వినియోగంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తెలంగాణ డీజీపీ సి. వి. ఆనంద్, ఐపీఎస్ ఆదేశాలు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో బుధవారం సైబర్ అవగాహన దినోత్సవం సందర్భంగా జడ్చర్లలోని డాక్టర్ బి. ఆర్. ఆర్. డిగ్రీ కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే పలు మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ కొనుగోలు మోసాలు, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలు, సామాజిక మాధ్యమాలను సురక్షితంగా వినియోగించే విధానంపై పవర్‌పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం/సీవీవీ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు, క్యూఆర్ కోడ్‌లు, అనుమానాస్పద యాప్‌లను ఉపయోగించవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల సమూహాలు, గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పద యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టకుండా ఉండాలని, డబ్బు పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో తమ ఫోన్ నంబర్, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత చిత్రాలు, నివాస స్థానం, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వారితో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్కు సమాచారం అందించాలని, జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయా లని సూచించారు. రానున్న వినాయక చవితి సందర్భంగా జిల్లా పరిధిలోని అన్ని వినాయక మండపాల్లో ఈ పోస్టర్లను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. తద్వారా దర్శనానికి వచ్చే ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. సైబర్ నేరాల నివారణలో విద్యార్థుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని ఎస్పీ డి. జానకి పేర్కొన్నారు. ప్రజలు, పోలీసులు పరస్పర సహకారంతో పనిచేస్తే సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరీ కుమార్, జడ్చర్ల ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, వైస్ ప్రిన్సిపాళ్లు నర్మద, శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్సై శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు చేపిస్తారా?

**అమాయక చిన్నారులతో మత మార్పిడిని ప్రోత్సహిస్తారా?**
**ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి తీవ్ర ఆగ్రహం**
**చిట్కుల్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఘటన**
**కలెక్టర్, ఉన్నతాధికారులకు తక్షణ విచారణ ఆదేశాలు**




**పటాన్‌చెరు,(సింగిడి):** ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు ఎలా ప్రోత్సహిస్తారా? విద్యార్థినిల పుస్తకాలతో పాటు ఇతర మతాలకు చెందిన పుస్తకాలు పాఠశాలలోకి ఎలా అనుమతిస్తారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సంగారెడ్డి జిల్లా చిట్కుల్ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో పాఠశాలలో విద్యాసంస్థల నిబంధనలకు విరుద్ధంగా మత ప్రచారాలు, అనధికారిక కార్యకలాపాలు జరుగుతున్న విషయం ఆయన దృష్టికి రాగా... అధికారుల పై మండిపడ్డారు.. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న వసతులు, విద్యాబోధన తీరు మరియు మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి రుచి, శుచిని స్వయంగా ఆరా తీశారు. ఈ తనిఖీ సమయంలో పాఠశాలలో ఇతర మతాలకు సంబంధించిన పుస్తకాలు పెద్ద ఎత్తున లభించడం, ప్రతి ఆదివారం ప్రత్యేక మందిరం ఏర్పాటు చేసి మతపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తించి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28 ప్రకారం ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి మత ప్రచారాలు, ప్రార్థనలు నిర్వహించరాదని వీటిని ఆయన స్పష్టం చేశారు. పవిత్రమైన విద్యా దేవాలయాలను ఇతర కార్యకలాపాలకు వేదికగా మారుస్తున్న తీరుపై మండిపడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి మత ప్రచారానికి పాల్పడిన సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బందిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, జోన్, జోనల్ ఆఫీసర్ భీమయ్యలతో వెంటనే ఫోన్ లో మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్న అనధికార మతపరమైన కార్యకలాపాల వివరాలను వారికి వివరించి, తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై తగిన చర్యలు



తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతులు కల్పించేలా ప్రతి విద్యార్థి మీద రూ. 1.8 లక్షల ఖర్చు చేస్తోందని ప్రభుత్వం కల్పిస్తోందని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టి పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయులు, నాయకులు సుభాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ "సమర బేరి"



**చేవెళ్ల,(సింగిడి):** ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజ లకు ఒరిగిందేమీ లేదని ఆరోపిస్తూ చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం నిరసన చేపట్టారు. హామీల అమలులో, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మండి పడ్డ నాయకులు.. హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలుకు ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, కౌన్సిలర్స్,దూత మల్లేష్,దప్పు సుధాకర్ చందు,కుర్వ మంగమ్మ మల్లేష్,సర్పంచులు,నరహరి రెడ్డి,నాయకులు విజయ భాస్కర్ రెడ్డి,నత్తి కృష్ణ రెడ్డి,దేశాముల అంజనేయులు, దండు సత్యం, కరుణాకర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,శేరి రాజు,హనుమంత్ రెడ్డి,మాధవ్ గౌడ్,రాంప్రసాద్, బ్యాగరి సుదర్శన్,పృథ్వి,జంగారెడ్డి జహీద్, ప్రభాకర్ రెడ్డి,కడమంచి ఆనంద్,నరేందర్ రెడ్డి, మల్ల రెడ్డి,రామ గౌడ్,తలారి యాదయ్య, బేగరి మహేష్,కసిరె వెంకటేష్,తోట చంద్రశేఖర్, బ్యాగరి నర్సింలు,వాకిలి కృష్ణ,పాండు,వెంకటేష్, బొట్టు హనుమంత్ రెడ్డి, ముకుందం గౌడ్,మహేందర్ తదితర పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## నోటీసులందుకున్న ఓటర్ల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి



**రాజేంద్రనగర్,(సింగిడి):** నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా తక్షణ పరిష్కారం చూపాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన 'ఓటరు జాబితా నమోదు బస్తీ సభ'లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రక్రియను, అధికారుల పనితీరును స్వయంగా పరిశీలించారు. మ్యాపింగ్ కాని వారికి, సవరణలు ఉన్న వారికి నోటీసులు సక్రమంగా అందుతున్నాయా లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు పొందిన వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే ఓటరు జాబితా నమోదును నిర్ధారించాలని స్పష్టం చేశారు. బస్తీ సభల ప్రాంగణంలో ఓటర్లతో సీఈఓ నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఒక్కరికీ నోటీసులు అందించి, పూర్తి ఆధారాలు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఈ ధ్రువీకరణ ప్రక్రియ తనిఖీ: బస్తీ సభలలో అధికారులు ఓటర్ల దరఖాస్తులను విచారిస్తున్న విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ? ఈ తనిఖీ కార్యక్రమంలో సీఈఓ సుదర్శన్ రెడ్డితో పాటు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాసరెడ్డి, ఏఈఆర్వో బి. సురేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ చేపట్టిన పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ..

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

**వైఎస్సార్, జీడీ శ్రీనివాస్ గౌడ్ వర్ధంతుల సందర్భంగా మున్సిపల్, ఆశ వర్కర్స్ లకు చీరల పంపిణీ...**




**మల్కాజిగిరి,(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం లో వైఎస్ఆర్ ముఖ్య మంత్రి చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 17వ వర్ధంతి, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీడి శ్రీనివాస్ గౌడ్ మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ గౌడ్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్‌జిత్ గౌడ్ ల ఆధ్వర్యంలో మల్కాజిగిరి లోని గాంధీ పార్క్ లో మున్సిపల్ కార్మికు లకు, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతరావు, టీపీసీసీ పరిశీలకుడు షమీర్ కౌశల్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ లు పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్సార్ అందించిన సేవలను స్మరించుకు న్నారు. అదేవిధంగా మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధి కోసం జీడి శ్రీనివాస్ గౌడ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు, కార్మిక వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ కుమార్, మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, మాజి కౌన్సిలర్ ఎస్ ఆర్ ప్రసాద్, జి ఎన్ వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్స్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, నూరి సత్య మూర్తి, పిట్ల నాగరాజు, ప్రవీణ్, శ్రీకాంత్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మీ, బాబు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహేందర్ గౌడ్, గౌస్ భాయ్, కొండా గౌడ్, రవీందర్ రెడ్డి, నగేష్ గౌడ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, పార్థసారధి, సంజయ్, ఆశ, శారద, భూదేవి, ఇంద్ర, అసిమ్, రాజు, చారి అగోండా, కుమార్ గౌడ్, రవీందర్, వినయ్ నిరుగొండ, రాజేష్, లింగం, రామచందర్, వెంకన్న, సిరిగిరీ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయి

**కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు బి. శ్రీనివాస్ గౌడ్**



**చేవెళ్ళ (సింగిడి)::** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు చిరస్థాయిగా గుర్తుండిపోతా యని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం చేవెళ్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్,టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం మాట్లాడుతూ.. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. వైఎస్సార్ హయాంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతర గతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలిగించారని పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి వైద్యాన్ని సామాన్యులకు చేరువ చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు ఈ కార్యక్రమానికి టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,మాజీ చైర్మన్ సోలి పురం బలవంత్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశం, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ బక్కరెడ్డి రవీందర్ రెడ్డి, ఖదీర్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పడాల రాములు, కార్యదర్శులు గుండాల రాములు, మాణిక్యం, డైరెక్టర్ జనార్దన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు బుచ్చిరెడ్డి, రామిరెడ్డి, శశిధర్ గౌడ్,మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, జహంగీర్, అనంతరాములు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్ గారి కార్తీక్ రెడ్డి, ఉప సర్పంచ్లు పాండు గౌడ్, విష్ణు గౌడ్, నాయకులు చంద్రయ్య, కిరణ్ గౌడ్, మల్ గారి బుచ్చిరెడ్డి, బేగారి శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, శివ కుమార్ రెడ్డి, కరికే మల్లేష్, యాదయ్య, నర్సింలు, పామేనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## జర్నలిస్టుల కలానికి భద్రత కల్పించాలి.

**మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి**



**జవహర్‌నగర్,(సింగిడి):** ప్రజల గొంతుకకు స్వేచ్ఛ, జర్నలిస్టుల కలానికి భద్రత, మీడియాలో సామాజిక ప్రాతినిధ్యం కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం నిర్వహిస్తున్న మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం బాలాజీనగర్ లోని అంబేద్కర్ మహనీయుల విగ్రహాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు అశోక్ మాదిగ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ మహంకాళి బిక్షపతి మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో దళిత జర్నలిస్ట్ పుల్ల రవీందర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు సామాజిక న్యాయం, వృత్తిపరమైన భద్రత, మీడియాలో సముచిత సామాజిక ప్రాతినిధ్యం కల్పించేందుకు ఫోరం చేస్తున్న పోరాటాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ బూడిద నరేందర్, అంబాల విష్ణు, అంబాల మల్లేష్ పాల్గొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా ఎస్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రామ్ నాయక్ సంఘీభావం తెలిపారు.

## ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రప టాన్ని ఏర్పాటు చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత అని కొనియాడారు. ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రత్యేకంగా రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజలకు ఎంతో చేరువయ్యారని నాయకులు పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే విధంగా పలు పథకాలను అమలు చేసిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రజల కోసం చేసిన సేవలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో , సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హామీలపై నిలదీస్తే మాపైనే దాడులా?



**జవహర్‌నగర్ బిఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ వర్గీయుల తోపులాట.**
**ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం.**
**జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య**
**బిఆర్ఎస్ మేడ్చల్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి.**



**జవహర్ నగర్,(సింగిడి):** దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 33 నెలల్లోనే తెలంగాణ వ్యాప్తంగా ప్రజా వ్యతిరేకతతో రికార్డు కొట్టిందని హామీల అమలుపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే కాంగ్రెస్ శ్రేణులు మాపై అకారణంగా దాడికి దిగడం తగదని తీవ్రస్థాయిలో మాజీ మేయర్ మేకల కావ్య ఖండించా రు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పోరుబాటలో పార్టీ పిలుపులో భాగంగా జవహర్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ మేయర్ మేకల కావ్య పార్టీ అధ్యక్షుడు కొండలు ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. 420 హామీల ఎగవేత బ్యానర్ను ప్రదర్శిస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా బిఆర్ఎస్ శ్రేణులపైకి దూసుకొచ్చి బ్యానర్ను చించి వేయడం జరిగింది. దీంతో కొంతసేపు ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అకారణంగా మమ్ములను ఎందుకు అడ్డుకుంటున్నారని మాజీ మేయర్ ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచకుండా హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడుస్తున్న పథకాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను పచ్చని తెలంగాణలో మార్చితే రేవంత్ రెడ్డి ఆకలి కేకల తెలంగాణ గా మార్చాలని తెలిపారు. బిఆర్ఎస్ కార్యకర్తలు హామీలపై నిలదీస్తే పలకకపోవడం ఎందుకనీ ప్రశ్నించారు. బి ఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని ఎలాంటి కష్టం వచ్చినా వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. అనంతరం ప్రజలకు 420 హామీలకు కార్డులను పంచుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్ పల్లపు రవి నాయకులు ప్రసాద్ గౌడ్ వెంకటేష్ గౌడ్ బాలరాజ్ సోమయ్య దిలీప్ అహ్మద్బాషా సాయి ప్రశాంత్ నవీన్ గౌడ్ ఎల్ల స్వామి అశోక్ విక్రమ్ భాస్కర్ శోభ రెడ్డి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం... మహేందర్ రెడ్డి. మా కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుండే కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగడం దారుణమని చామకూర మహేందర్ రెడ్డి హెచ్చరించారు. హామీలను నిలదీస్తే ఎందుకంత కోపం 33 నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ రౌడీయిజం చేయాలని చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెప్తామన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తామని ప్రజలు కాంగ్రెస్ ను తిరస్కరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల దాడులను నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. శ్రేణులకు అండగా ఉంటానని మహేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. త్వరలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని లెక్కలతో సహా చెల్లిస్తామన్నారు.

# వెయ్యి రోజులు పూర్తయినా హామీల అమలు ఎక్కడ?

**– తెలంగాణ రక్షణ సేన పార్టీ**



**నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):** నారాయణపేట్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండల కేంద్రానికి ఈ నెల 4 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో మద్దూర్‌లో విలేకరుల సమావేశం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు నేటికి పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ప్రతి మండల కేంద్రంలో కాలేజీ, మద్దూర్ మండలానికి స్టేడియం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కూటీలు, తులం బంగారం, పెన్షన్ల పెంపు తదితర హామీలను ప్రజలకు ఇచ్చి, వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మద్దూర్ మండలానికి హామీ ఇచ్చిన స్టేడియం నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ డిమాండ్ చేసింది. అమర్‌గడ్డలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన పెచ్చులు ఊడిపోతున్నాయని, నిర్మాణ నాణ్యతపై అధికారులు వెంటనే పరిశీలన చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా గురుకుల హాస్టల్‌కు రహదారి నిర్మాణం విషయంలో ప్రజలకు నష్టం కలిగించే విధంగా సుమారు 100 ఇళ్లను తొలగించే పరిస్థితి రాకుండా, పోలీస్ స్టేషన్ ముందుగా ఉన్న మార్గం ద్వారా రహదారి నిర్మిస్తే తక్కువ నష్టంతో సమస్యను పరిష్కరించవచ్చని సూచించారు. రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో సుమారు 2, వేల కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ డిమాండ్ చేసింది. రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్ ఎవరైనా సరే, ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్లు నాణ్యంగా, దీర్ఘకాలికంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీకి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించి, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ ముఖ్యమంత్రిని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలి జనార్దన్, మద్దూర్ మండల పార్టీ అధ్యక్షులు మరికంటి రవికుమార్, కొత్తపల్లి మండల అధ్యక్షులు శివశంకర్, జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ కుమార్ గౌడ్, జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, అలాగే మాధవ్, నరేష్, మహిపాల్, నర్సింగ్‌రావు, ప్రసాద్, పాకిరప్ప, నర్సాపూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నందిపేట్ ఉజ్వల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి యోగాసన పోటీలు

**గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్, మెడల్స్ ప్రధానం**




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** యోగా అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో నంది పేట్ లోని ఉజ్వల హైస్కూల్లో 17వ నిజామాబాద్ జిల్లా స్థాయి యోగాసన పోటీలను నిర్వహించారు. పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి దాదాపుగా 400 మంది క్రీడాకారులు పాలొన్నారు. ముఖ్యఅతిథులుగా డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్, సైనికు వెల్ఫేర్ ఆఫీసర్, టూరిజం డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ పవన్ కుమార్, ఎస్జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, నంది పేట్ సర్పంచ్ ఎర్రం లింగం హాజరయ్యారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. నంది పేట్ సర్పంచ్ ఎర్రం లింగన్న మాట్లాడుతూ నంది పేట్ లో ఇలాంటి ఉన్నత స్థాయి యోగాసనా పోటీలు నిర్వహించడం తో సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలు కూడా నంది పేట్ లో నిర్వహించాలని, అందుకు మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యోగా సంఘం తరపున అబ్జర్వర్ గా విచ్చేసిన ఉప్పు రవీందర్, పోతనలు తెలంగాణ యోగా సంఘం నిర్వహించి కార్యకలాపాల గురించి వివరిం చారు. జిల్లా యువజన క్రీడా అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు యోగా ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలో కూడా రాణించాలని సూచించారు. నంది పేట్ మండలంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని, నంది పేటలో క్రీడా ప్రాంగణం నిర్వహణకు నిధులు మంజూరు చేయడానికి చేరును తీసుకుంటానని హామీ ఇచ్చారు. ట్రస్మా అధ్యక్షులు, ఉజ్వల స్కూల్ కరస్పాండెంట్ జి. అరుణ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యోగా పోటీలు మా పాఠశాలలో నిర్వహించడం గర్వంగా ఉందని, ఇంత మంచి అవకాశాన్ని మాకు కల్పించినందుకు యోగా సంఘానికి రుణపడి ఉంటామని భవిష్యత్తులో ఇలాంటి ఈ కార్యక్రమాని నిర్వహించడానికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. యోగా సంఘం అధ్యక్షురాలు డా. ఐశ్వర్య మాట్లాడుతూ తమ సంఘం చేసే పనుల గురించి వివరించారు. యోగా సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ పోటీలో గెలుపొందిన మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.



## పవన్‌కు ప్రత్యే ఫోటోతో
# బన్నీ శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కెరీర్ ఆరంభం నాటి క్లాసిక్, స్టైలిష్ లుక్‌తో కూడిన ఒక వింటేజ్ పోస్టర్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. 90ల నాటి సినిమా స్టిల్లా అన్నట్లుగా ఉన్న ఈ క్రేజీ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఒత్తుగా ఉన్న కర్లీ హెయిర్, షార్ప్ లుక్ మరియు బ్లాక్ టీ-షర్ట్‌తో సరికొత్త స్టైలిష్ వైబ్స్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన ట్రిబ్యూట్ పోస్టర్ ద్వారా అల్లు అర్జున్ తన బాబాయ్ పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు. మెగా అభిమానులు సైతం ఈ ఫొటోను సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేస్తూ పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు.

# కొన్నేళ్ల తర్వాతైనా సరైన నిర్ణయం అనిపించాలి

సినిమాల వసూళ్ల కంటే పోషించిన పాత్రలతో గుర్తుండిపోవడమే తనకు ముఖ్యమని అంటోంది నాయిక తాప్సి. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'గాంధారి' నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సి తన ఖాతాలో రూ.వంద కోట్లు సాధించిన సినిమాలు ఎక్కువగా లేకపోయినా తాను సంతృప్తిగానే ఉన్నానని అంది. "బాక్సాఫీస్ వద్ద అంతగా రాణించని చిత్రాలు చాలానే ఉంటాయి. ఓ పదేళ్ల తర్వాత వాటిని ఉత్తమ చిత్రాలుగా పరిగణిస్తారు. ఆ సినిమాలకు కల్ట్ స్టేటస్ ఇస్తారు. ఇలాంటివి నా కెరీర్‌లో ఎన్నో చూశాను. ఈ అనుభవంతోనే తాత్కాలిక ప్రతిఫలం కన్నా.. నా ఫిల్మోగ్రఫీకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే నా ఫిల్మోగ్రఫీ శాశ్వతంగా ఉంటుంది. కాలం మారుతుంది. కానీ నా చిత్రాల జాబితా మారదు. కొన్నేళ్ల తర్వాత నా పనిని తిరిగి చూసుకున్నప్పుడు నేను సరైన నిర్ణయం తీసుకున్నాననే భావన నాలో కలగాలి" అని చెప్పుకొచ్చింది తాప్సి.

సిన్మా సింగిడి
Cinma Singidi

గురువారం
3-9-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737